ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 28.05.2026 | సంపుటి : 12 | సంచిక : 308 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపెంచాలి



చర్చించేందుకు సమయమివ్వండి
మహారాష్ట్ర ముఖ్యమంత్రికి
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్(జనంసాక్షి):తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత?చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా మహారాష్ట్ర అప్పట్లో తెలిపింది.ఇటీవల ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: సమీక్షించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల

మిగతా 2లో..

## అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు

### అమలుపై కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చ

హైదరాబాద్(జనంసాక్షి):అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న

మిగతా 2లో..



## అకాల వర్షంతో అన్నదాతకు భారీ నష్టం





బుధవారం కురిసిన అకాల వర్షానికి మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

నీటిలో తడిసి కొట్టుకుపోయిన ధాన్యాన్ని సేకరిస్తున్న మహిళ

### కల్లాలోనే తడిసి ముద్దైన ధాన్యం

### చేతికొచ్చిన పంట నీటిపాలవడంతో కన్నీరుమున్నీరైన అన్నదాత

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసి నీటిపాలయ్యింది. కన్న బిడ్డలా కాపాడుకున్న పంట అమ్మకం కోసం నిరీక్షిస్తున్న రైతుకు చివరాఖరికి కన్నీరే మిగిలింది.సిద్దిపేట జిల్లాలో అకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మండలాల్లో అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షం అన్నదాతల గుండెల్లో గుబులు రేపింది. ఆయా మండలాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యపు రాశులు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన ధాన్యపు సంచులు సైతం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా మార్కెట్ యార్డులు, రహదారులపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు మండలం బండతిమ్మపూర్ లో భారీ వర్షానికి ధాన్యం, పశుసంపద నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందారు. నర్సాపూర్ నియోజకవర్గం, పాపన్న పేట మండలంలోని కొనుగోలు కేంద్రాలు జలమయమై

మిగతా 2లో..

## అప్రమత్తంగా ఉండాలి

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ నేపథ్యంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

## నాలుగైదు రోజులు అకాల వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక

## బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి

అకాల వర్షాల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు

ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

వివరాలు 2 పేజీలో..

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

ఇది రైతుపక్షపాత ప్రభుత్వం
తెలంగాణా రైతాంగం ఆందోళన చెందొద్దు



ఇప్పటి వరకు 9,214 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించాం

- రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలను ప్రభుత్వం ఉపేక్షించబోదు
- రాజకీయ లబ్ది కొరకే ప్రతిపక్షాల రాద్ధాంతం
- చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని ,రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు.అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉత్పన్నమయిన పరిణామాలను సమీక్షించేందుకు గాను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యవసరంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర , రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు,పోలీస్ అధికారులు,రవాణా శాఖాధికారులతో పాటుపౌర సరఫరాల శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకొబోదన్నారు.ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం కటుబడి ఉందని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు.స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..

## నేడు సిద్ధిరామయ్య రాజీనామా!

- గరవ్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు!

న్యూఢిల్లీ(జనంసాక్షి):కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి

మిగతా 9లో..






## ఎక్కువ ఇళ్లు నిర్మించకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీచేయను

- కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్
- త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం
- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి

మిగతా 2లో..

## మాజీ సీఎం పినరయ్ నివాసాలపై ఈడీ దాడులు

- కొచ్చిన్ మినరల్స్ లిమిటెడ్ కేసులో దర్యాప్తు సంస్థ సోదాలు
- నెలకొన్న ఉద్రిక్తత

తిరువనంతపురం(జనంసాక్షి): కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు దిగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో భాగంగా సోదాలు చేపట్టింది. మాజీ సీఎం నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ

మిగతా 2లో..





## ‘సర్’ సరైందే..

ప్రక్రియను నిర్వహించే అధికారం ఈసీకి ఉంది
స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను ఎస్ఐఆర్ నిర్ధారిస్తుంది
వ్యతిరేక పిటిషన్లను విచారించి తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) ఉన్న అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఎస్?ఐఆర్? భిన్నంగా ఉన్నంత మాత్రాన దీనిని కొట్టివేయలేమని, ఇది పూర్తిగా రాజ్యాంగబద్ధమైనది, చట్టబద్ధమైనదని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని బుధవారం అత్యున్నత ధర్మాసనం పేర్కొంది.'మొదట్లో ఎక్కువ మందిని ఓటరు జాబితా నుంచి తొలగించేదిగా ఎస్ఐఆర్ కనిపిస్తుంది. కానీ తగిన రక్ష చర్యల ద్వారా దీనిని సరిగ్గా రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చు. మొత్తానికి ఎస్ఐఆర్ నిర్వహించడం ద్వారా ఈసీ తన పరిధి దాటి వ్యవహరించలేదు' అని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అంతేకాదు ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం పరిపాలనా సౌలభ్యం కోసమే చేపట్టిన చర్య అని నిర్ధరించలేదమని స్పష్టం చేసింది. ‘ఎస్ఐఆర్ అనేది స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలనే రాజ్యాంగ ఆశయాన్ని పటిష్టం చేస్తుందని మేము భావిస్తున్నాం’

మిగతా 2లో..

సీబీఎస్ఈ త్రిభాషా సూత్రం..

## రెండు వారాల్లోగా వివరణ ఇవ్వండి

కేంద్రానికి ‘సుప్రీం’ నోటీసులు

మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరణ

2లో..

## ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి

- సీబీఎస్ఈ ఓఎస్ఏం వివాదంపై రాహుల్ గాంధీ ఫైర్
- ఇటీవలే రిలీజైన సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు
- కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ పద్ధతిపై తీవ్ర ఆందోళనలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : జైరాం రమేశ్



న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో నిండిపోయాయని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రా హుల్ గాంధీ ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజానిజాలను వెలికి తీసేందుకు స్వతంత్రంగా న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోఎంప్ట్‌కు సీబీఎస్ఈ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించారు. కోఎంప్ట్ యాజమాన్యానికీ, ప్రధాని మోదీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. కాగా, సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. దీంతో

మిగతా 2లో..

## సరిహద్దుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
ఆ ప్రాంత కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్-పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా

మిగతా 9లో..

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

రికార్డ్ స్థాయిలో అదీ రబీ సీజన్ లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించిందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇప్పటివరకు 10,097 కోట్ల రూపాయలను చెల్లించినట్లు ఆయన వెల్లడించారు.దీనివల్ల 8.15 లక్షల మంది రైతులకు లబ్ది చెకురుందని ఆయన పేర్కొన్నారు.కొనుగోలులో తెలంగాణా రాష్ట్రం సరికొత్త రికార్డ్ సృష్టించిందన్నారు.కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని ఆయన వివరించారు.ఇసుక సరఫరా చేసే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణ చేసేందుకు వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ముందెన్నడూ లేని రీతిలో 8575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుంటే రాజకీయాల కోసం ప్రతిపక్షాలు ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియను రాద్ధాంతం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ రైతాంగానికి ఎక్కడ ఆటంకాలు ఏర్పడ కుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సి నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మిల్లర్లు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్లోడింగ్ చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని అన్లోడింగ్ చేసుకోనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ధాన్యాన్ని తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దేశించిన సమయంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, పి డి డి ఆర్ డి ఎ శ్రీలత, ట్రాన్స్పోర్ట్ అధికారి సదానందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం పినరయ్ నివాసాలపై ఈడీ దాడులు

అధి కారులు సోదాలు చేపట్టారు. రూ.1.72 కోట్ల ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి ఎలాంటి సేవలు అందించలేదు. అయినప్పటికీ సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2024లో ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు తిరువనంతపురం లోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసం, కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసంతో సహా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో అధికారులతో, కట్టుదిట్టమైన గోప్యత మధ్య ఈ సోదాలు మొదలయ్యాయి.

**ఈడీ అధికారుల కారుపై రాళ్లదాడి**

మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాం డరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెల కొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్య కర్తలుగా అనుమాని స్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ఎండలతో జాగ్రత్త!

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచనలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశవ్యాప్తంగా రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతుండ టంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాల్పుల ప్రభావం వల్ల దైనందిన జీవితాల్లో ఇబ్బందులు పెరుగుతున్నాయని, డీహైడ్రేషన్ బారిన పడకుండా చూసుకోవాలని ఎక్స్ వేదికగా తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లొద్దన్నారు. ఖాళీ దొరికితే కొంతసేపు విశ్రాంతి తీసుకోవా లన్నారు. ప్రజలు తగినంత నీళ్లు తాగుతూ ఉండాలని బయటకు వెళ్లేటప్పుడు తమవెంట నీళ్లు తీసుకెళ్లాలని మోదీ సూచించారు. వీలైతే దాహంతో ఉన్నవారికి తమవంతుగా సహాయం చేయాలని కోరారు. బాటసారుల కోసం ఇళ్లు, దుకాణాల బయట తాగునీరు ఏర్పాటు చేస్తున్న వారిని ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బయట పనిచేసేవారు తీవ్రమైన వేడికి ముఖ్యంగా గురయ్యే అవకాశం ఉందని ప్రధాని మోదీ హెచ్చరించారు. వడదెబ్బ హెచ్చరిక సంకేతాలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని, అది త్వరగా ప్రమాదకరంగా మారవచ్చని అన్నారు. వేడిమితో బాధపడుతున్న వారికి సహాయపడాలని, వారికి ఉపశమనం కలిగించేలా నీరు, ఓఆర్ఎస్ మొదలైనవి అందేలా చూడాలని కూడా మోదీ పౌరులను కోరారు. "తల తిరగడం, వికారం లేదా తీవ్రమైన అలసట వంటి వడదెబ్బ లక్షణాల పట్ల జాగ్రత్తగా ఉండండి. మీ చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అనారోగ్యంగా, నీరసంగా అనిపిస్తే లేదా తలనొప్పి వస్తే, వారిని వెంటనే చల్లని, నీడ ఉన్న ప్రదేశానికి తరలించి సహాయపడండి." అని ఆయన అన్నారు. వడగాలుల సమయంలో వీలైనప్పుడల్లా వృద్ధులైన తల్లిదండ్రులు, తాతామామ్మలు, ప్రియమైన వారికి ఫోన్ చేసి వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని ప్రధానమంత్రి పౌరులను కోరారు.ఈ కఠినమైన వాతావరణంలో పక్షులు, జంతువులను కూడా గుర్తుంచుకోవాలని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "ఈ తీవ్రమైన వేడిలో మన చుట్టూ ఉన్న పక్షులు, జంతువులను కూడా గుర్తుంచుకుందాం. మీ ఇల్లు, బాల్కనీలు, టెర్రస్‌లు, దుకాణాలు లేదా కార్యాలయాల బయట ఉంచిన ఒక చిన్న గిన్నెడు నీరు దాహంతో ఉన్న పక్షికి ప్రాణదాత కాగలదు. ఈ కష్టకాలంలో కరుణ మనకు మార్గదర్శకం కావాలి." అని అన్నారు. భారత వాతావరణ శాఖ ప్రకారం, దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు సంభవిస్తున్నాయి. రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల పాటు మధ్య, వాయువ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు వడగాలుల నుంచి తీవ్రమైన వడగాలుల పరిస్థితుల్లో కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించింది.

# అకాల వర్షంతో అన్నదాతకు భారీ నష్టం

చెరువులను తలపించాయి. సంగారెడ్డి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వేల ధాన్యపు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో వడ్లు తూకం వేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. చొప్పదండి, రామడుగు, గంగాధర, మానకొండూరు మండలాల్లో వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిముద్దైంది. నెల రోజులుగా విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మార్కెట్లో అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న, ధాన్యం తడిచిపోయింది. వర్షానికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి పోసిన మక్కలు, వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కుండపోత వర్షం కురవడంతో వరి ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి.. కొంత ధాన్యం కొట్టుకుపోగా, మక్కల బస్తాలు సైతం తడిసిపోయాయి. మార్క్ ఫెడ్ ద్వారా నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించగా నేటికీ మక్కలను కొనలేదని అందుకే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు.కామారెడ్డి జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద అరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. మాచారెడ్డి, కామారెడ్డి, బిక్కనూర్, దోమకొండ, బీబీపేట్ మండలాలతోపాటు రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివ నగర్ మండలాల్లో సైతం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. హమాలీల కొరత, అధికారుల అలసత్వంతో కాంటా ఆలస్యం కావడంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇలాంటి నష్టం జరిగేది కాదని వాపోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మార్కెట్‌లో ఆరబెట్టి సంచుల్లో నింపిన మె?క్కజొన్న, ధాన్యం తడిసిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు పడుతున్న ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ : రెండు మూడు వారాలుగా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనకుండా ఇప్పుడు నష్టాలపాలు చేశారని రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## అప్రమత్తంగా ఉండాలి

- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):**వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

### నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపసమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణం పరిస్థితులు ఎలా ఉండనున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడు దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి.తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే వేసవికాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలోని కొన్నింటికీ రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు.వేసవి కాలంలో భూభాగం బాగా వేడెక్కి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడు అదే సమయంలో విండ్ డైరెక్షన్?లో మార్పులు వచ్చి తేమ గాలులు సముద్ర ప్రాంతం నుంచి భూ ప్రాంతాన్ని ప్రవేశించినప్పుడు మధ్యాహ్న సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతుంటాయని శ్రీనివాస్ రావు అన్నారు. దీంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగుపాటు, వడగండ్ల వాతావరణం ఉంటుందని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని వివరించారు.

### బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి

– అకాల వర్షాల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు
– ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపెంచాలి

సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సీఎం వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని ప్రస్తావించారు.

### అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు

నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై కేంద్రమంత్రితో సీఎం ప్రస్తావించారు. దీనిపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

## ముగిసిన తొలిరోజు విచారణ

మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్

**హైదరాబాద్(జనంసాక్షి):**పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉంది. మంగళవారం బండి భగీరథ్‌ని 3 రోజులపాటు పోలీసు కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. బుధవారం పోలీసులు భగీరథ్‌ని కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి పెట్‌బషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అనంతరం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లారు

## రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్టిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మీకంటే..

## ఎక్కువ ఇళ్లు నిర్మించకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీచేయను

అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యానం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

## 'సర్' సరైందే...



అని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగ నిబంధనలు, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు అనేవి ఓటర్ల జాబితాల సమగ్రత, కచ్చితత్వం, విశ్వసనీయతపై ఆధారపడి ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం పోలింగ్ నిర్వహణ ప్రక్రియపైనే స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు ఆధారపడి ఉండవని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. బిహార్‌లో చేపట్టిన ఎస్?ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది.

సీబీఎస్ఈ త్రిభాషా సూత్రం..

### రెండు వారాల్లోగా వివరణ ఇవ్వండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):జులై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్ఈ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ క్రమంలోనే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం.. కేంద్రం, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీలకు ఈ అంశంపై నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఈ వ్యవహారం రాజ్యాంగపరమైన అంశాలతో ముడిపడి ఉందని సిబల్ అన్నారు. భాష అనేది ఛాయిస్ సంబంధించిన విషయమని, దానిని బలవంతంగా రుద్దలేమని తెలిపారు. ఈ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించిన సర్వోన్నత న్యాయస్థానం తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి సీబీఎస్ఈ లాజిస్టికల్ సంసిద్ధతపై నివేదిక సమర్పించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీని ఆదేశించింది.2026-27 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు రెండు భారతీయ భాషలతో పాటు మొత్తం మూడు భాషలు తప్పనిసరిగా చదవాలని సీబీఎస్ఈ పేర్కొంది. ఏదైనా విదేశీ భాషను చదవాలని కోరుకునే విద్యార్థులు తృతీయ భాషగా మాత్రమే దాన్ని ఎంపిక చేసుకోవచ్చని ఈనెల 15న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)- 2020, పాఠశాల విద్య జాతీయ పాఠ్య ప్రణాళిక- 2023కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

## ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి

తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.మూల్యాంకన వ్యవస్థలో జరిగిన అవకతవకల కారణంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వివాదం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఉద్దేశపూర్వక కుట్రను సూచిస్తోందని అన్నారు. మూల్యాంకన వ్యవస్థకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "సీబీఎస్ఈ ఫలితాల స్కామ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులుగ్ర్భ్బాంతికి గురయ్యారు. ఇక మోదీజీ విషయానికొస్తే ఎప్పటిలాగే ఈ విషయంపై ఆయన దగ్గర సమాధానాలు లేవు. జవాబుదారీతనం లేదు." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు."సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల నిర్వహణ బాధ్యత అప్పగించిన కోఎంప్ట్ సంస్థ గతంలో 2019లో తెలంగాణలో గ్లోబరేనా పేరుతో పనిచేస్తూ ఇలాంటి దుశ్చర్యలకే పాల్పడింది. పేరు మారినా ఆ సంస్థ ఉద్దేశం, స్వభావం మారలేదు. ఆ సంస్థ చరిత్ర బహిరంగంగానే ఉన్నప్పటికీ, లెక్కచేయకుండా సీబీఎస్ఈ కాంట్రాక్టును దానికి అప్పగించారు. 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అలాంటి సంస్థకు అప్పగించారు. ఇది పొరపాటు కాదు. ప్లాన్ ప్రకారం చేసిన కుట్ర. గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు కోఎంప్ట్ గతంలో వివాదాల్లో చిక్కుకున్న విషయం సీబీఎస్ఈకి ఎలా తెలియకుండా పోయింది.ఆ సంస్థ నేపథ్యం గురించి ఎంక్వైరీ ఎందుకు చేయలేదు?. అసలు కోఎంప్ట్ యాజమాన్యానికీ, మోదీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం ఏంటి? సీబీఎస్ఈ పరీక్షలు రాసిన జెన్ జెడ్ మిత్రుల కష్టఫలాలను గానీ, భవిష్యత్తును గానీ ఎవరూ దొంగిలించలేరు. మేము ఈ కుట్ర మూలాలను కనుగొని, ఈ అవినీతిని ఒక్కసారిగా సమూలంగా నిర్మూలిస్తాం." అని రాహుల్ గాంధీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : జైరాం రమేశ్**

మరోవైపు, సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ విరుచుకుపడ్డారు. తన పదవిని వదులుకోకూడదని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పట్టుబట్టడం, ప్రధాని మంత్రి ఆయనను కాపాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది 12వ తరగతి బోర్డు పరీక్షలకు ఓఎస్ఎం విధానాన్ని అమలు చేయడానికి ముందు, వివిధ ప్రాంతీయ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టులు నిర్వహించాలన్న తమ సొంత పాలకమండలి సభ్యుల అభిప్రాయాలను సీబీఎస్ఈ విస్మరించిందని ఒక మీడియా నివేదిక వెల్లడించిందని ఈ సందర్భంగా జైరాం రమేశ్ ఉటంకించారు. "విద్యా విధానానికి సంబంధించిన విషయాలపై చర్చించే కేంద్ర విద్యా సలహా మండలి 2019 నుంచి ఇప్పటివరకు ఒక్కసారి సమావేశం కాలేదు. మోదీ ప్రభుత్వ జాతీయ విద్యా విధానం- 2020 కూడా కేంద్ర విద్యా సలహా మండలిని బలోపేతం చేయాలని పిలుపునిస్తోంది. కానీ కేంద్ర విద్యా శాఖ ఈ విషయాన్ని పక్కన పెట్టేసింది. 2014కు ముందు కౌన్సిల్ దాదాపు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశమయ్యేది. ధర్మేంద్ర ప్రధాన్ కనుసన్నల్లో మన ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రబలిన అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు." అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మెడికల్ కాలేజీ ఉద్యోగాల పేరుతో రూ.2 లక్షల మోసం




**నిర్మల్ బ్యూరో, మే27 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో మెడికల్ కాలేజీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఓ ఏజెంట్ ఇద్దరు నిరుద్యోగులను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు రాథోడ్ వికాస్, రాథోడ్ శివకృష్ణ బుధవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో తమ గోడును వెల్లడించారు. సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన తమకు ఆఫీస్ సబర్డినేట్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రాజేందర్ అనే వ్యక్తి హామీ ఇచ్చి రూ.2 లక్షలు వసూలు చేశాడని తెలిపారు. డబ్బులు తీసుకున్న తర్వాత ఆరు నెలలు గడిచినా ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో ప్రశ్నించగా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలు ఇచ్చాడన్నారు. ఆ కాపీలతో మెడికల్ కాలేజీకి వెళ్లగా అవి ఫేక్ ఆర్డర్లు అని అధికారులు చెప్పారని బాధితులు వాపోయారు. ప్రస్తుతం ఏజెంట్ ఫోన్‌కు స్పందించడం లేదని, జిల్లాలో ఇంకా పలువురు ఇదే విధంగా మోసపోయారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఉద్యోగాల పేరు మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**బజార్‌హత్నూర్ /ఇచ్చోడ మే 27 (జనంసాక్షి) :** మండలంలోని కామగిరి గ్రామానికి చెందిన నక్కల రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ సీఐ తెలిపిన తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, నిందితుడు జీడిమెట్లకు చెందిన ఉప్పడి శంకర్ అనే వ్యక్తి కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి ఫిర్యాదు దారు కుటుంబ సభ్యుల నుంచి దశల వారీగా రూ.18,50,000/- తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగాలు ఇప్పించలేనని చెబుతూ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి కేవలం రూ.1 లక్ష మాత్రమే తిరిగి ఇచ్చి మిగతా రూ.17.50 లక్షలు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మోసాలకు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితునిచే బాధింపబడిన ఇతర బాధితులు ఎవరైనా ఉన్నట్లయితే నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## భక్తుల విశ్వాసాలను అనుగుణంగా ఆలయాలను నిర్వహించాలి



### మంత్రి కొండా సురేఖ సూచనలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత దేవాదాయశాఖ అధికారుల పై వున్నదని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. కోట్లాది రూపాయల నిధులతో రాష్ట్రంలోని దేవాలయాలను వైభవోపేతంగా తీర్చిదిద్దే దిశగా సీఎం రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రతి అధికారి అంకితభావంతో పని చేయాలని మంత్రి సురేఖ ఆదేశించారు. బంజారా హిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోని క్యాంపు కార్యాలయంలో దేవాదాయశాఖ పై మీడియాలో వచ్చిన ప్రతికూల కథనాల పై మంత్రి సురేఖ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణా రావు, దేవాదాయశాఖకు చెందిన పలువురు ఇతర ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై గత సంవత్సరం కాలంగా వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వేదికల్లో వచ్చిన వార్తలు, కథనాలు, ప్రజా అభిప్రాయాలను ఈ సమావేశం విస్తృతంగా చర్చించింది. ఈ సందర్భంగా దేవాలయాల నిర్వహణ, భక్తుల నమ్మకాలు, వారికి అందుతున్న సేవలు, దేవాలయ ఆస్తుల పరిరక్షణ, పారదర్శకత, ఆలయ ఆదాయాల వినియోగం, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై మీడియాలో వచ్చిన ప్రతికూల వార్తలను ఉన్నతాధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై ఇప్పటికే శాఖాపరంగా తీసుకున్న చర్యల పురోగతిని అధికారులు మంత్రి సురేఖకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, దేవాదాయ శాఖ ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలపాల్సిన బాధ్యత అధికారుల పై ఉంద న్నారు. దేవాలయాల పట్ల భక్తుల్లో నమ్మకం మరింత బలపడేలా అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరిం చాలని సూచించారు. మీడియా లో వచ్చిన కథనాలపై దృష్టి సారించి, లోపాలు ఎక్కడ ఉన్నా వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవల నాణ్యతను పెంచాలని, ప్రసాదాల నాణ్యత, ఆలయాల పరిశుభ్రత, భద్రత, సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

## చికెన్ కర్రీలో బల్లి!

- కోదాడ క్రాస్ రోడ్డు రమేష్ డాబాలో ఘటన
- వేడి వేడిగా తింటూ బల్లి కనిపించడంతో నిర్ఘాంతపోయిన కస్టమర్



**ఖమ్మం టౌన్ (జనం సాక్షి) :** వేడి వేడిగా వండి వడ్డించే దాబాల్లో చికెన్ కర్రీ ఆర్డర్ చేస్తే దానితో పాటు బల్లి మాంసం కూడా ఉచితంగా లభిస్తుంది. ఇది నిజంగా నిజమండీ బాబు.! ఆరగించే ధైర్యం ఉంటేనే ఇలాంటి దాబాలకు వెళ్లాలి మరి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్ లో ఉన్న రమేశ్ దాబా – 1లో చికెన్ కర్రీలో బల్లి దర్శనం ఇవ్వడం కలకలం రేపింది. బుధవారం మధ్యాహ్నం లంచ్ బ్రేక్ కోసం రమేష్ డాబా – 1 దగ్గర ఆగిన ముగ్గురు వ్యక్తులు చికెన్ కర్రీ, పుల్కాలు ఆర్డర్ చేశారు. బాగా ఆకలి వేస్తుండటంతో ఎంచక్కా చికెన్ కర్రీతో పుల్కాలు తింటుండగా అందులో బల్లి దర్శనమిచ్చింది. దీంతో వాళ్లు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. ఇప్పటిదాకా రుచిగా ఆరగించింది బల్లి పడిన చికెన్ కర్రీనా? అని బెంబేలెత్తారు. వెంటనే నిర్వాహకులను పిలిచి గట్టిగా ప్రశ్నించారు. అయినా వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానమే వినిపించింది. ఫలితంగా కస్టమర్లు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆహార తనిఖీ అధికారులు అక్కడికి చేరుకుని శాంపిల్స్ కలెక్ట్ చేశారు. వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై ఎలాంటి నిఘా లేదని అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే హోటళ్లు, దాబాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పట్టణంలో కల్తీ ఫుడ్, నాసిరకం ఆహారంపై అధికారుల నిఘా పూర్తిగా విఫలమైందని ప్రజలు మండిపడుతున్నారు. రోజురోజుకూ హోటళు ., దాబాల్లో నాణ్యత లేని ఆహారం విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

## క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందిస్తాయి

- బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త
- విజేతలకు బహుమతులు ప్రదానం



**హైదరాబాద్ (జనంసాక్ష) :** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని బాడ్మింటన్ అసోసి యెషన్ ఆఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాడ్మింటన్ చాంపియన్ షిప్–2026 పోటీలు శనివారం నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడ్మింటన్ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలు పెంపోందిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను అన్నివిధాల ప్రోత్సహి స్తుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు బాడ్మింటన్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్రీధర్ బాబు అలాగే ప్రధాన కార్యదర్శి పుల్లెలగోపీచంద్ అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నేను వారికి అండగా ఉంటానని ఆయన అన్నారు.




మిగతా వారందరికీ బహుమతులు అందజేశారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అడ్వైజరీ లక్ష్మణ్ అలాగే ఈవెంట్స్ కన్వీనర్ బాబు మాట్లాడుతూ క్రీడాకారులను అన్ని విధాలా అండగా ఉంటాం అని క్రీడల్లో రాణించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలి అని వారి అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాట్మెంటన్ వైస్ ప్రెసిడెంట్ నరేందర్ గారు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. వికాస్ హర్ష, జాయింట్ సెక్రటరీ నాగరాజు, ఘఎవంష్ట్ర ఘఎబ , వేణు ,ఎస్.కే రేష్మా, సోహైల్ శీతల్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 27(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్నందున అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, డిఎస్‌పి అశోక్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీన కెరమెరి మండలం కొటారి గ్రామంలో ఇందిరమ్మ నివాస గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం, లబ్ధిదారులతో కలిసి భోజనం, ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున హెలిపాడ్ వద్ద ప్రముఖులకు స్వాగతం, గ్రామస్తులతో మాట్లాడనున్నందున అవసరమైన ఏర్పాట్లు షామియానా, పైలాన్ ప్రారంభం, ప్రముఖుల పార్కింగ్, అధికారుల వాహనాల పార్కింగ్, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారిపై గుంతలను పూడ్చాలని సూచిం చారు. సాయంత్రం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో బహిరంగ సభ ఉన్నందున సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు అందించాలని, సభా ప్రదేశంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, హెలిపాడ్ వద్ద భారీ కేడింగ్ ఏర్పాట్లు, వైద్య బృందాలు, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సభకు వచ్చే ప్రము ఖులు, అధికారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కొతారి గ్రామం నుండి కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన వస్తున్నందున అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. బహిరంగ సభలో ప్రముఖుల గ్యాలరీ, వీడియో గ్యాలరీ ఏర్పాటు చేయాలని, అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. అంతకుముందు ఈనెల 29న రెబ్బెన మండలం రౌట సంకెపల్లిలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటించను నందున సమీకృత కలెక్టరేట్ అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం పథకాల సమీక్ష నిర్వహిస్తారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గవర్నర్ హెలికాప్టర్ ద్వారా వస్తున్నందున హెలిప్యాడ్ ప్రదేశంలో అంబులెన్స్ కాన్వాయ్ ను సిద్ధంగా ఉంచాలని, కలెక్టరేట్ కు వస్తున్న తరుణంలో గవర్నర్ కు పోలీసు గౌరవ వందన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి: వేముల

**నిజామాబాద్, మే27 (జనంసాక్షి) :** అకాల వర్షంతో తడిసిన ధాన్యం కొనగడంతో పాటు, నష్టపోయిన రైతలను ఆదుకోవాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్ చేశారు. సకాలంలో పంటలు కొనుగోలు చేసివుంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. అలవికాని హామీలు ఇచ్చి గద్దదెనెక్కిన కాంగ్రెస్ వాటి అమలులో పూర్తిగా విఫలమైంది. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి రగులుతున్నది. బీఆర్ఎస్‌కు రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతున్న దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్సే గెలుస్తుందని, మళ్లీ కేసీఆ ర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రైతుబంధు పేరుతో కేసీఆర్ ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయం అందిస్తే, రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ పది వేలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

- రద్దీని తట్టుకునేందుకు ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి):** రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 29 నుంచి జూన్ 3 వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే మరికొన్ని రోజులు కూడా అదనపు సేవలు కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ పక్రియలో వేగం, పారదర్శకత పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

- హరీష్ రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం
- తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ



**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం పై హరీష్ రావు సంచలన ఆరోపణల నుంచి దృష్టిని మరల్చడానికే మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. సింగరేణిని సీఎం బామ్మర్దికి అప్పగించారని ఆరోపించారు. తనపై తెలంగాణ ఉద్యమంలో 226 కేసులు ఉన్నాయని, సీసీఎస్ డార్క్ సెల్‌తో సహా హైదరాబాద్ నగరంలో అన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని వెల్లడించారు.సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచాను.ప్రజల దృష్టిని మరల్చడానికి తన వ్యాఖ్యలను చీప్ ట్రిక్ కింద వాడారని విమర్శించారు. సీఎం కార్యాలయం డైరెక్షన్ మేరకు తనను ట్రోల్ చేస్తున్నారని వివరించారు. మరోసారి తనపై కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు . క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇబ్బందులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. . ఫార్మా కంపెనీని కాలుస్తా అన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్‌పై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నాడు ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చాలని పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఏ వర్గం సంతృప్తిగా లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను టార్గెట్ చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. శ్రీలంకలో,బంగ్లాదేశ్ లో ప్రజలు తిరగబడునట్లు తెలంగాణలోను ప్రజల తిరుగుబాటు వస్తుందని వెల్లడించారు. సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించే లోగా రైతుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,ప్లలె రవికుమార్ , కురువ విజయ్ కుమార్ , తుంగ బాలు , పడాల సతీష్ రాజేష్ ,రవీందర్ రెడ్డి ,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూముల గొడవలే కారణం

- న్యాయవాది హత్య కేసులో పోలీసుల నిర్ధారణ
- తండ్రీకొడుకులను అరెస్ట్ చేసిన పోలీసులు



**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన రాజకీయ నేతతోపాటు ఆయన కుమారుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. విచారిస్తున్నారు. వక్ఫ్ బోర్డు నుంచి సదరు రాజకీయ నేతను తప్పించాలని న్యాయవాది మొయినుద్దీన్ తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో రూ.15 లక్షల సుపారీ ఇచ్చి.. న్యాయవాదిని ఈ తండ్రికొడుకులు హత్య చేయించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట, లక్డీకాపూల్, మల్లేపల్లి భూముల వివాదంలో ఈ న్యాయవాది హత్య జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడయింది. వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ పోరాడుతున్నారు. మే 23వ తేదీన మాసబ్ ట్యాంక్ సమీపంలో మొయినుద్దీన్.. తన కారు ఎక్కుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆయన్ని బలంగా ఢీకొట్టి.. అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గమనించిన మొయినుద్దీన్ కుటుంబ సభ్యులు.. వెంటనే ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మరణించారు. ఘటనపై తొలుత పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనపై పలు సందేహాలు వ్యక్తం కావడంతో.. ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. న్యాయవాదిని ఢీకొట్టిన కారుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో.. ఈ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో నిందితుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వక్ఫ్ భూముల విషయంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

## బక్కని నర్సింహులు క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



**హైదరాబాద్(జనంసాక్షి) :** టీడీపీ జాతీయ మహానాడు సందర్భంగా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు బక్కని నర్సింహులు తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లాడారని, తెలంగాణ అనే పదం డిక్ష నరి లో లేదని మహానాడులో మాట్లాడటాన్ని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు ఖండించారు. తెలంగాణ అనేది "డిక్షనరి"లో వెతికేందుకు అది ఒక "పదం" కాదురా సన్నాసి....! అని, నాలుగు కోట్ల ప్రజల అస్తిత్వ, ఆత్మ గౌరవ "పోరాట ప్రాంతం" అని వందలాది సంవత్సరాల క్రితమే "త్రిలింగదేశం" గా వర్ధిల్లిన ప్రాంతం తెలంగాణ అని, చరిత్ర చదవకుండా,కేవలం డిక్షనరిలో వెతికే మోకాళ్ళలో మెదడు కలిగి, సీమాంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగుతూ తెలంగాణఅస్తిత్వం పై దాడి చేస్తే ఖబడ్దార్ బిడ్డ అని హెచ్చరించారు. తెలంగాణ ఆరు దశబ్దల ఆత్మ గౌరవ పోరాటన్ని, అమరుల త్యాగాలను అవహేళన చేసేలా మాట్లాడిన బక్క ని నర్సింహులు తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ లు చెప్పాలని, లేని యెడల తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెపుతారని అన్నారు.

సంపాదకీయం

జనంసాక్షి

# రైతన్నకు ఎన్నాళ్లీ నిరాదరణ?

భారతదేశపు వెన్నెముక అయిన రైతు నేడు వంగిపోతున్నాడు. ప్రకృతి వైపరీత్యాల దెబ్బకు కాదు, వ్యవస్థాగత నిర్లక్ష్యపు భారానికి. విత్తనం వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చేవరకు ఆరు నెలల అవిశ్రాంత శ్రమ, కానీ ఆ శ్రమకు తగిన ప్రతిఫలం దొరకడం లేదు. అకాల వర్షాలు, వడగళ్ళ వాన, తుఫానులు పండిన పంటను నేలకు కొడుతున్నాయి. అప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రైతు మరింత అగాధంలో కూరుకుపోతున్నాడు.

పంట చేతికొచ్చాక కూడా రైతు పరీక్ష తీరదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయవు. టోకెన్ల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. ధాన్యం తడిసిపోతుంది, నాణ్యత తగ్గుతుంది, దళారీల చేతుల్లో పడటం తప్పడం లేదు. మద్దతు ధర పేరు చెప్పి, తూకంలో తేడా చూపి, తరుగు పేరిట కోత వేసి రైతుకు చివరికి అందేది కనీస ఆదాయం కూడా కాదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర కేవలం కాగితాలకే పరిమితమవుతోంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘాలు దశాబ్దాలుగా అడుగుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి, హామీలు మారుతున్నాయి. కానీ రైతుల కన్నీళ్ళు ఆగడం లేదు.

వ్యవసాయ ఉత్పత్తి వ్యయం ఏటా పెరుగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చులు, అన్నీ రెట్టింపవుతున్నాయి. కానీ పంటకు వచ్చే ధర మాత్రం అదే స్థాయిలో ఉంటోంది, కొన్నిసార్లు తగ్గిపోతోంది కూడా. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సి2ం50% సూత్రం అంటే మొత్తం వ్యయానికి యాభై శాతం లాభం ఇప్పటికీ అమలు కాలేదు. ఇది రైతుపై చేస్తున్న ఆర్థిక అన్యాయం. అకాల వర్షాలకు పంట నష్టపోతే పరిహారం కోసం రైతు నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. పంట బీమా పథకాలు బీమా కంపెనీలకు లాభదాయకంగా ఉన్నాయే తప్ప రైతుకు చేరే నష్టపరిహారం అరకొరగా ఉంటోంది. సర్వే జాప్యం, పేపర్ వర్క్ సంక్లిష్టత, అవినీతి, ఇవన్నీ రైతును ఇంకా నిరాశకు గురిచేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఒక్క ప్రశ్న దేశాన్ని వణికించాలి. రైతు పండించడం మానేస్తే ఏమవుతుంది? భారతదేశం ఇంకా 60 కోట్లకు పైగా జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. రైతు ఉత్పాదకత తగ్గితే ఆహార భద్రత దెబ్బతింటుంది, ద్రవ్యోల్బణం తీవ్రమవుతుంది, దిగుమతులపై ఆధారపడటం పెరిగి దేశ సార్వభౌమత్వానికే సవాలు అవుతుంది. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం, జాతీయ భద్రతను నిర్లక్ష్యం చేయడమే.

కేంద్రం ఇకనైనా మేల్కోవాల్సిన సమయం వచ్చింది. కేవలం ఎన్నికల హామీలతో, రుణమాఫీల సానుభూతితో రైతు సమస్యలు పరిష్కారం కావు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన హక్కు కల్పించాలి. స్వామినాథన్ సిఫార్సులు పూర్తిగా అమలు చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో తూకం మోసాలు, తరుగు కోతలపై సున్నా సహనం విధానం పాటించాలి. పంట బీమా పరిహారం 15 రోజుల్లో నేరుగా రైతు ఖాతాలో జమ చేయాలి. శీతల గిడ్డంగులు, గ్రామీణ మార్కెట్ లింకేజీలు విస్తృతం చేసి దళారీ వ్యవస్థను తొలగించాలి. వాతావరణ మార్పులను తట్టుకునే విత్తన రకాల పరిశోధన వేగవంతం చేయాలి. రైతు కేవలం ఓటు బ్యాంకు కాదు, అతడు దేశపు పునాది. అన్నదాత చేతిలో కొడవలి బదులు అప్పుల నోటీసు పట్టుకోవాల్సిన దుస్థితి దేశానికి సిగ్గుచేటు. “జై జవాన్, జై కిసాన్” అన్న నినాదం బోర్డులపై మాత్రమే ఉండకూడదు. రైతు జీవితంలో ప్రతిఫలించాలి. పంట పండించడం మానేసిన రోజు ఆకలి రాజ్యమేలుతుంది. ఆ రోజు రాకముందే కేంద్ర ప్రభుత్వం మేల్కొని, రైతు పక్షాన నిలబడి, చేతల్లో చూపాలి.

# దేశాత్మ అమ్మకానికి కాదు!

## ఒక తరం శ్రమ, మన భవిత... నేడు వేలంలో?



ఒక తండ్రి తన జీవితకాలం రక్తాన్ని చెమటగా మార్చి, అహర్నిశలూ శ్రమించి సంపాదించిన ఇల్లు, పొలం, వ్యాపారం అన్నింటినీ తన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం వదిలివెళ్తాడు. ఆ ఆస్తులు కేవలం ఇటుకలు, సున్నం, మట్టితో కూడిన గోడలు మాత్రమే కాదు. అందులో ఆ తండ్రి ప్రాణం ఉంటుంది, ఆయన ఆత్మ దాగి ఉంటుంది. సరిగ్గా అదే విధంగా, సుదీర్ఘ పోరాటం తర్వాత స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ, ఈ దేశ నిర్మాతలు జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని నాడు రక్తం చిందించిన లక్షలాది మంది పేద శ్రమజీవుల వరకు తమ చెమటను, కన్నీటిని పెట్టుబడిగా పెట్టి నిర్మించిన మన ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశానికి అసలైన ఆత్మ. కానీ, విచారకరం ఏంటంటే నేడు ఆ ఆత్మనే బహిరంగంగా వేలంలో పెడుతున్నారు. ఇది కేవలం ఒక ఆర్థిక నిర్ణయమో, పద్దుల పుస్తకాల్లోని అంకెల మార్పో కాదు. ఇది ఒక మహోజ్వల జాతి చరిత్రను, ఒక తరం చేసిన అనితర సాధ్యమైన త్యాగాన్ని, లక్షలాది మంది కార్మికుల పొట్టగొట్టేలా ఒకే ఒక్క కలానో, ఒక ఒప్పందపు సంతకంతోనో శాశ్వతంగా చెరిపివేయడం. ఇలాంటి క్రూరమైన నిర్ణయాలు తీసుకునే పాలకులకు అసలు గుండె ఉందా? అసలు ఈ దేశం అంటే ఏమిటో, ఇక్కడి మట్టి వాసన ఏమిటో వారికి తెలుసా? ఈ నిలదీతలకు, ప్రశ్నలకు సమాధానాలు ఏ ఎయిర్ కండిషన్డ్ గదుల్లోనో దొరకవు, ఈ నేల తల్లి నుంచే మనం వెతకాలి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు కలలు కన్నది.ఈ దేశాన్ని ఇలా కార్పొరేట్ శక్తులకు అమ్మడానికా?

భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల (PSUs) ప్రస్థానం 1947 నాటిది. నాటి దార్శనిక నాయకులు ఒక సత్యాన్ని చాలా స్పష్టంగా గుర్తించారు. కొత్తగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న స్వతంత్ర భారతావని తన పౌరులకు ఉపాధి, సంక్షేమం, కనీస భద్రత అందించాలంటే బలమైన ప్రభుత్వ రంగం వెన్నెముకలా నిలబడాలని వారు నమ్మారు. ఆ నమ్మకం నుంచే ఉక్కు, బొగ్గు, చమురు, రక్షణ, విద్యుత్, రైల్వే వంటి భారీ వ్యూహాత్మక సంస్థలు పురుడుపోసుకున్నాయి. BHEL, SAIL, ONGC, HAL, BSNL, LIC ఇవి కేవలం బోర్డులపై ఉండే నాలుగు అక్షరాల పేర్లు కాదు. ఇవి కోట్లాది శ్రామిక కుటుంబాల బతుకు తెరువు, వారి గుండెల నిండా నిండిన ఆశలు.నేడు అదే మహావృక్షాల లాంటి సంస్థలు ఒక్కొక్కటిగా ప్రైవేట్ పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలోకి వెళ్తున్నాయి. ఈ అమ్మకానికి వారు రంగురంగుల పేర్లు పెట్టవచ్చు విలీనం అనో, వ్యూహాత్మక పెట్టుబడి ఉపసంహరణ అనో, ప్రైవేటీకరణ అనో ముద్దు పేర్లతో పిలవవచ్చు. కానీ, నిష్ఠుర సత్యం మాత్రం ఒక్కటే. దేశ ప్రజల సొత్తయిన ఆస్తులు కొద్దిమంది కార్పొరేట్ దిగ్గజాల జేబుల్లోకి వెళుతున్నాయి. రండి, ఒకసారి చరిత్ర పుటలను తిరగేద్దాం. 2021లో ఎయిర్ ఇండియా (Air India) విక్రయం జరిగింది. 1948లో, అంటే స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి సంవత్సరమే ప్రభుత్వం నెలకొల్పిన ఈ సంస్థ ఒక దేశపు సగర్వ కలను మోసింది. జె.ఆర్.డి. టాటా చేతుల్లో అద్భుతంగా పుట్టి, జాతి ఆకాంక్షల రెక్కలతో అంతర్జాతీయ నింగిలో ఎగిరిన ఆ మహారాజా విమాన సంస్థ పాలకుల ఒక్క కలంపోటుతో ప్రైవేట్ పరమైంది. అక్కడితో ఆగలేదు.ధీూజూ, దేశీయ పోర్టులు, కీలకమైన విద్యుత్ సంస్థలు, నమ్మకానికి మారుపేరైన బీమా రంగం అన్నీ ఇప్పుడు పాలకుల టార్గెట్ లిస్టులో ఉన్నాయి. మన జీవితాలకు భరోసా ఇచ్చిన ఎల్‌ఐసి (ూ×జ)ని కూడా పాక్షికంగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. సామాన్య ప్రజల రక్తాన్ని పిండి కూడబెట్టిన డబ్బుతో నిర్మించిన ఆ బీమా సామ్రాజ్యం ఇప్పుడు షేర్ మార్కెట్ ఊగిసలాటల జూదంలో చిక్కుకుంది.ప్రస్తుత సర్కారు ప్రజల ముందు ఉంచే రొటీన్ వాదన ఏంటంటే నష్టాల్లో నడుస్తున్న సంస్థలు ప్రభుత్వ ఖజానాకు భారంగా మారాయి, వాటిని మరింత సమర్థంగా, లాభసాటిగా నడపడానికి ప్రైవేట్ రంగానికి అప్పగించడమే దేశ శ్రేయస్కరం. పైపైన వినడానికి ఈ మాటలు కార్పొరేట్ మేనేజ్‌మెంట్ పాఠాల్లా చాలా హేతుబద్ధంగా అనిపిస్తాయి. కానీ ఒక్క క్షణం ఆగి, గుండె మీద చెయ్యి వేసుకుని ఆలోచించండి ఒక ప్రభుత్వ సంస్థ నష్టాల్లోకి కూరుకుపోయిందంటే, దానికి అసలు బాధ్యులు ఎవరు?దానిని సరైన పద్ధతిలో నిర్వహించకపోవడం,ఐఏఎస్ అధికారుల, రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం,సంస్థ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం,ఆధునీకరణను పూర్తిగా విస్మరించడం ఇవన్నీ ఎవరి పుణ్యమా అని జరిగాయి? ఖచ్చితంగా ప్రభుత్వాల చేతగానితనం వల్లే కదా! మరి తాము చేసిన తప్పులకు, తమ నిర్లక్ష్యానికి పరిష్కారం ఆ సంస్థలను అంగడి సరుకులా అమ్మేయడమేనా? ఇది ఎంత హాస్యాస్పదం! పైగా, అసలు ట్విస్ట్ ఏంటంటే అమ్మకానికి పెట్టిన అన్ని ప్రభుత్వ రంగ సంస్థలూ నష్టాల్లో లేవు. ONGC, NTPC, BHEL, Coal India, HAL వంటి నవరత్న కంపెనీలు ఇప్పటికీ వేల కోట్ల లాభాల్లో నడుస్తున్నాయి. అయినా సరే, వీటిలో ప్రభుత్వ వాటాలను క్రమంగా తగ్గించే కుట్రలు జరుగుతున్నాయి. అంటే నష్టాలనే మాట కేవలం ఒక బూటకపు సాకు మాత్రమేనా? పాలకుల అసలు అజెండా ఏదైనా వేరేగా ఉందా? అనే అనుమానం రాక మానదు. ఇక్కడ మనం ఒక కఠోర, చేదైన ఆర్థిక సత్యాన్ని అంగీకరించాలి ప్రైవేటీకరణ అంటే లాభాలన్నీ ప్రైవేట్ వ్యక్తుల స్విస్ బ్యాంకు జేబుల్లోకి వెళ్తాయి, కానీ వాటి వల్ల వచ్చే నష్టాలు, భారం మాత్రం సమాజం నెత్తిన పడతాయి. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ చేసిన రాష్ట్రాల్లో కరెంట్ చార్జీలు ఎలా చుక్కలు చూపిస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. టెలికం రంగంలో ప్రైవేట్ సంస్థలు వచ్చిన కొత్తలో ఉచిత ఆఫర్లతో ఆకర్షించాయి, కానీ నేడు ప్రభుత్వ రంగ దీూచీూను దివాళా అంచునకు నెట్టి, ప్రైవేట్ కంపెనీలు కలిసికట్టుగా టారిఫ్ ధరలను పెంచుకుంటూ సామాన్యుడిని ఎలా దోచుకుంటున్నాయో మన కళ్ళముందే ఉంది. ఈ చేదు పాఠాలు ఇంకా మనకు బుద్ధి చెప్పవా?లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలు కూడా కార్పొరేట్ల పాలవుతున్నాయంటే అది ఆర్థిక శాస్త్రం కాదు, పక్కా క్రోనీ క్యాపిటలిజం వ్యాపారం.

మరో ముఖ్యమైన సామాజిక కోణం నుండి చూద్దాం ఈ విచ్చలవిడి అమ్మకాలు జరిగినప్పుడు ఇక్కడి ఉపాధి, రిజర్వేషన్లు ఏమవుతాయి? దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది శాశ్వత ఉద్యోగులు, కోట్లాది మంది కాంట్రాక్ట్ కార్మికులు వీరందరి భవిష్యత్తు ఒక్కసారిగా అంధకారంలోకి, అనిశ్చితిలోకి వెళ్ళిపోతుంది. ప్రైవేట్ రంగం ఎప్పుడూ దేశ సేవ కోసం పని చేయదు, అది కేవలం లాభాల వేట కోసమే పనిచేస్తుంది. లాభాలు పెరగాలంటే వారు చేసే మొదటి పని ఖర్చులు తగ్గించుకోవడం అంటే ఉద్యోగుల తొలగింపులు, లే-ఆఫ్‌లు. అంటే ఒక్కో ఉద్యోగం పోవడం అంటే, ఒక్కో శ్రామిక కుటుంబం వీధిన పడటమే.గుర్తుందా? 2017లో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన రాగానే ఆంధ్రప్రదేశ్ ఎలా ఉలిక్కిపడిందో! విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అంటూ ఒక్కసారిగా విశాఖ వీధులు ప్రజాపోరాటాలతో రగిలాయి. దశాబ్దాలుగా ఆ ఫ్యాక్టరీని నమ్ముకున్న కార్మికులు కన్నీళు పెట్టుకున్నారు. ప్రైవేటీకరణ వల్ల అద్భుతమైన సమర్థత, నాణ్యత వస్తుందని కార్పొరేట్ భజనపరులు చెప్తారు. కానీ ప్రపంచ చరిత్ర ఏం చెబుతోంది? అమెరికాలో 2008 నాటి ఘోరమైన ఆర్థిక సంక్షోభం, బ్రిటన్, యూరప్‌లలో ప్రైవేట్ వైద్యారోగ్య వ్యవస్థల ఘోర వైఫల్యం, మన పొరుగున ఉన్న శ్రీలంకలో జరిగిన ఆర్థిక కుప్పకూలడం ఇవన్నీ మనకు ఏం నేర్పుతున్నాయి? పేదవాడికి, మధ్యతరగతి వాడికి సమానంగా చేరుకోవాల్సిన ప్రాథమిక సేవలు ప్రైవేట్ పరమైనప్పుడు అవి కేవలం డబ్బున్న నోట్ల కట్టలకే అందుతాయి. అది అసలైన అభివృద్ధి కాదు అది సమాజంలో తీవ్రమైన ఆర్థిక వైషమ్యం.ఈ దేశం అంటే కేవలం నౌకాశ్రయాలు, విమానాశ్రయా లు కాదు.ఇది మన శ్వాస, మన అమ్మకానికి వచ్చిన వస్తువు అంతకన్నా కాదు.భగత్ సింగ్ ఉరిమంచం ఎక్కడానికి సరిగ్గా నిమిషాల ముందు చదివిన పుస్తకాల్లో ఒకటి లెనిన్ రాసిన సోషలిజం, ఆర్థిక సమానత్వం గురించే.రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్థిక న్యాయం అనేది అత్యంత కీలకమైన పునాది రాయి. నేడు మన పూర్వీకులు పైనుంచి చూస్తుంటే ఏమనుకుంటారు? తాము రక్తం ధారపోసి సంపాదించిన స్వేచ్ఛను, తమ ఆశయాలతో నిర్మించిన ఆధునిక దేవాలయాల లాంటి సంస్థలను నేడు పాలకులు కార్పొరేట్ శక్తులకు వేలం వేస్తున్నారని తెలిస్తే వారి ఆత్మ ఎంత ఘోషిస్తుంది?ఈ అమ్మకాల వెనక ఉన్న అసలైన లబ్ధిదారులు ఎవరు? విదేశీ పెట్టుబడిదారులా? దేశీయ క్రోనీ కార్పొరేట్ శక్తులా? లేక సాధారణ ప్రజలా? అంతర్జాతీయ గణాంకాలు చాలా స్పష్టంగా చెప్తున్నాయి ప్రైవేటీకరణ జరిగిన ప్రతిచోటా సేవల ధరలు విపరీతంగా పెరిగాయి, నాణ్యత పడిపోయింది, శాశ్వత ఉద్యోగాల సంఖ్య నానాటికీ తగ్గిపోయింది. అయినా సరే, ఈ ప్రైవేట్ పరుగు పందెం ఆగడం లేదు. ఎందుకు? అసలు ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరికి జవాబుదారీగా వ్యవహరిస్తోంది?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే యజమాని కాదు, ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ఒక కేర్‌టేకర్ (అమానతు) మాత్రమే. మరి ఆ నమ్మకంతో అప్పగించిన ప్రజా ఆస్తులను అమ్మేముందు ఈ దేశ ప్రజల అనుమతి ఏమైనా తీసుకున్నారా? దీనిపై జాతీయ స్థాయిలో ఏమైనా బహిరంగ చర్చ జరిగిందా? పార్లమెంట్‌లో ప్రతిపక్షాల, కార్మిక సంఘాల మాటలు విన్నారా? జవాబు మనందరికీ తెలుసు లేదు . అందుకే ఇది కేవలం వ్యాపార ఆర్థిక నిర్ణయం కాదు ఇది ప్రజల నమ్మకానికి చేసిన ముమ్మాటికీ ద్రోహం.ఇక్కడ ఒక విజ్ఞత గల మాట చెప్పాలి ప్రభుత్వ రంగ సంస్థలన్నీ వంద శాతం పరిపూర్ణంగా పనిచేస్తున్నాయని వాదించడం కూడా సత్యానికి దూరం అవుతుంది. వాటిలో లోపాలు ఉన్నాయి, అవి బాగుపడాలి. అవి మరింత సమర్థంగా నడవాలి. సామాన్య ప్రజలకు మెరుగైన, అవినీతి లేని సేవలు అందించాలి. కానీ దానికి పరిష్కారం ఆ సంస్థలను అమ్మేయడం కాదు వాటిని ప్రక్షాళన చేసే సంస్కరణ . సరైన ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్, రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట వేయడం, పూర్తి స్వయంప్రతిపత్తి, పారదర్శకత ఇవే ఆ సంస్థలను కాపాడే నిజమైన మార్గాలు. ఈ కష్టమైన మార్గంలో నడవకుండా, ఉన్నపళంగా అమ్మేసి సొమ్ము చేసుకోవాలనే సులభ మార్గం ఎంచుకోవడం పాలకుల బాధ్యత నుండి పారిపోవడమే అవుతుంది.ప్రియమైన పాఠకా, ఇప్పుడు నిన్ను ఒక వ్యక్తిగత ప్రశ్న అడగాలనుంది. నీ తాత గారు, నీ నాన్న లేదా ఆనాటి తరం వాళ్ళు దేశ స్వాతంత్ర్యం కోసం నేరుగా జైలుకు వెళ్లకపోవచ్చు. కానీ, వారు ఆ రోజుల్లో ఐదు రూపాయల టికెట్టు కొని సినిమా చూసినా, ఒక ఓటు వేసినా, ఒక చిన్న పన్ను కట్టినా ఆ చిన్న చర్యతో కూడా ఈ నవభారత నిర్మాణంలో వారు భాగస్వాములయ్యారు. ఆ ఉమ్మడి భాగస్వామ్యపు మధుర ఫలాలే నేడు మనం చూస్తున్న ఈ ప్రభుత్వ రంగ సంస్థలు.కానీ ఆ ఫలాలు ఇప్పుడు నీకు తెలియకుండానే కార్పొరేట్ల పరం అవుతున్నాయి. కనీసం నీ ముక్కైనా అడగకుండా, నీ అనుమతి లేకుండా నీ ఉమ్మడి ఆస్తి వేలం వేయబడుతోంది. ఇది చదువుతున్నప్పుడు నీ చేతిపై వెంట్రుకలు నిక్కబొడవటం లేదా? నీ గుండె కలుక్కుమనటం లేదా? ఆ వచ్చే ఆవేదనే, అనుభూతే మన అసలైన సామాజిక చైతన్యం. ఆ కదలికే మన బాధ్యత.

కేవలం సామాజిక మాధ్యమాల్లో కోపం వ్యక్తం చేయడంతో సరిపెట్టకుండా, మన అమూల్యమైన ఓటు హక్కును ఆలోచించి వినియోగించుకోవడం, పాలకులను నిలదీసి జవాబుదారీతనం అడగడం, దేశ హితాన్ని కోరే నిజాయితీ గల శక్తులకు మద్దతు ఇవ్వడం ఇవే నేటి తక్షణ అవసరం. ఇవి మనం ఇప్పుడు చేయకపోతే, రేపు మన పిల్లలు మనల్ని నిలదీసి అడుగుతారు.దేశ సంపదను దోచేస్తుంటే నాన్న, అమ్మా, మీరు ఆ సమయంలో ఏం చేసారు? అని.ఈ దేశం మన పూర్వీకుల నెత్తురితో సాధించబడింది. ఈ ప్రతిష్టాత్మక సంస్థలు వారి కలలతో, శ్రమతో నిర్మించబడ్డాయి. వాటిని కాపాడుకోవాల్సిన కనీస బాధ్యత ఈ తరం పౌరులుగా మనపై ఉంది. మనం మేల్కొంటేనే ఈ దేశం బతుకుతుంది. మనం గొంతు విప్పి మాట్లాడితేనే చరిత్ర మారుతుంది. మనం పాలకులను ప్రశ్నిస్తేనే జవాబులు వస్తాయి. ఈ విచ్చలవిడి అమ్మకాలను అడ్డుకుందాం. ఈ దేశ సంపదను కాపాడుకుందాం. ఇది కేవలం ఆర్థిక రంగానికి సంబంధించిన విషయం కాదు.ఇది మన జాతి అస్తిత్వ పోరాటం ఇందులో మనమంతా భాగస్వాములం కావాలి!

డా .సూర్యదేవర రామకృష్ణ ,
jaikisan999@gmail.com

# 12 ఏళ్ల పాలనపై యువత ప్రశ్నలు

## ప్రచార రాజకీయాల వెనుక ప్రజల అసలు జీవితం ఏంటి?




దేశాన్ని “విశ్వగురు”గా తీర్చిదిద్దుతామని, ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, అవినీతికి చెక్ పెడతామని హామీల వర్షం కురిపిస్తూ అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పన్నెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అయితే ఈ దశాబ్ద కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ప్రజల మనసుల్లో మిగిలింది ప్రకటనల వెలుగు కాదు... పెరిగిన ధరల మంట, నిరుద్యోగపు చీకటి, పన్నుల భారంతో నలిగిన మధ్యతరగతి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబాల బాధ. అధికార యంత్రాంగం విజయగాథలు వినిపిస్తున్నా, సామాన్యుడి జీవితం మాత్రం వేరే వాస్తవాన్ని చెబుతోంది.

2014 తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గినా, ఆ లాభం ప్రజలకు అందలేదు. కేంద్ర ఎక్సైజ్ పన్నులు పెంచడంతో పెట్రోల్, డీజిల్ ధరలు భారంగా మారాయి. రవాణా ఖర్చులు పెరిగి ప్రతి నిత్యావసర వస్తువు ధరపై ప్రభావం పడింది. కూరగాయలు, పప్పులు, పాలు, వంటనూనెల నుంచి ప్రతి వస్తువు సామాన్యుడి జేబుకు భారమైంది. మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చులు రెట్టింపు కాగా, ఆదాయాలు అదే స్థాయిలో పెరగలేదు. ఫలితంగా కుటుంబాలు అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.

జీఎస్టీని “ఒక దేశం - ఒక పన్ను”గా ప్రచారం చేసినా, చిన్న వ్యాపారులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. సాధారణ వినియోగ వస్తువులపై పన్నులు పెరిగినప్పటికీ, భారీ కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు కొనసాగాయి. ప్రజలపై పన్నుల భారం పెరుగుతుండగా, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగం పెరగడం ఆర్థిక అసమానతలను మరింత పెంచిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరుద్యోగం ఈ కాలపు అతిపెద్ద సంక్షోభంగా మారింది. డిగ్రీలు, సర్టిఫికెట్లు ఉన్నా ఉద్యోగాలు దొరకని పరిస్థితి యువతను తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఒక ఉద్యోగ నోటిఫికేషన్‌కు లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం సాధారణమైంది. పరీక్షల్లో పేపర్ లీకులు, నియామకాలపై కోర్టు కేసులు, సంవత్సరాల ఆలస్యం యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టాయి. నిరుద్యోగం కారణంగా మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్న గణాంకాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.

వ్యవసాయ రంగం కూడా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పినా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్ ధరలు అమాంతం పెరిగాయి. కనీస మద్దతు ధరలపై రైతుల నిరసనలు దేశ రాజధానిని కుదిపేశాయి. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి రావడం రైతాంగ అసంతృప్తికి నిదర్శనంగా నిలిచింది. రైతు ఆత్మహత్యలు తగ్గకపోవడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనతను బయటపెడుతోంది.

మహిళల భద్రత విషయంలో కూడా నినాదాలు, వాస్తవాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నాయి. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహహింస ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. మణిపూర్ హింస వంటి సంఘటనలపై ఆలస్య స్పందన ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తింది. “బేటీ బచావో” నినాదం ఉన్నా, నేలమీద మహిళల భద్రతకు అవసరమైన వ్యవస్థాత్మక మార్పులు కనిపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థపై భారీ అప్పుల భారం పెరుగుతోంది. అప్పు తీసుకుని అభివృద్ధి చేయడం తప్పు కాకపోయినా, ఆ అభివృద్ధి ప్రజల జీవితాల్లో ప్రతిఫలించకపోతే ప్రశ్నలు రావడం సహజం. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో గణనీయమైన మార్పులు కనిపించకపోయినా, భారీ ప్రాజెక్టులు, ఈవెంట్లు, ప్రచార కార్యక్రమాలపై ఖర్చులు పెరిగాయి. వడ్డీ చెల్లింపులకే లక్షల కోట్లు వెళ్తున్న పరిస్థితి భవిష్యత్ తరాలపై భారంగా మారుతోంది.

నోట్ల రద్దు నిర్ణయం ఇప్పటికీ వివాదాస్పదంగానే మిగిలింది. నల్లధనం నిర్మూలన పేరిట తీసుకున్న ఆ నిర్ణయం చిన్న వ్యాపారాలు, అసంఘటిత రంగ కార్మికులను తీవ్రంగా దెబ్బతీసింది. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు వందల కిలోమీటర్లు నడుచుకుంటూ స్వగ్రామాలకు వెళ్లిన దృశ్యాలు దేశ పరిపాలనా లోపాలను బహిర్గతం చేశాయి.

ప్రజాస్వామ్య హక్కులు, పత్రికా స్వేచ్ఛ, దర్యాప్తు సంస్థల వినియోగంపై కూడా విమర్శలు పెరిగాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు, కార్యకర్తలు, ప్రతిపక్ష నేతలపై కేసులు పెరిగాయని పలు అంతర్జాతీయ నివేదికలు సూచించాయి. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలను దేశద్రోహం ముద్రతో అణచివేయాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని మేధావులు హెచ్చరిస్తున్నారు.

మతం, కులం, భాష ఆధారంగా సామాజిక విభజనలు పెరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు భావోద్వేగ రాజకీయాలను ఉపయోగిస్తున్నారనే అభిప్రాయం బలపడుతోంది. విదేశాంగ రంగంలో ప్రచారం ఎక్కువైనా, పొరుగు దేశాలతో సంబంధాలు ఉద్రిక్తంగా మారడం, చైనా సరిహద్దు సమస్యలు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది.

ఇవన్నీ కలిపి చూస్తే ప్రచార రాజకీయాలు మరియు నేలమీద ప్రజల జీవితం మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. యువతకు కావాల్సింది నినాదాలు కాదు - ఉద్యోగాలు. రైతులకు కావాల్సింది ప్రకటనలు కాదు - గిట్టుబాటు ధర. మధ్యతరగతికి కావాల్సింది భారీ ఈవెంట్లు కాదు - అందుబాటు జీవనం. మహిళలకు కావాల్సింది హామీలు కాదు - భద్రత. ప్రజాస్వామ్యంలో అసలు అభివృద్ధి కొలమానం జీడీపీ గణాంకాలు కాదు... సామాన్యుడి జీవిత నాణ్యత. ఒక యువకుడికి ఉద్యోగం దొరికిందా? ఒక రైతు అప్పుల భారం లేకుండా బతుకుతున్నాడా? ఒక కుటుంబం నెలాఖరుకు అప్పులేకుండా గడపగలుగుతున్నదా? ఈ ప్రశ్నలకు సమాధానాలే పాలన విజయాన్ని నిర్ణయిస్తాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# లోకజ్ఞానం -పుస్తక జ్ఞానం కంటే గొప్పదా?

నిన్నటి సంచిక తరువాయి



చిన్న విషయాల నుంచే పెద్ద అర్థాలను గ్రహిస్తాడు. సామాజిక ప్రవర్తనపై నిర్వహించిన అధ్యయనాల్లో సుమారు 68% మంది ప్రజలు వినయంగా ప్రవర్తించే వ్యక్తులను ఎక్కువగా గౌరవిస్తున్నారని తేలింది. సమాజంలో గౌరవం పొందేది కూడా ఇలాంటి వ్యక్తులే.

పుస్తక జ్ఞానం ఎక్కువగా వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడితే, లోకజ్ఞానం సామాజిక అవగాహనను పెంచుతుంది. ఒక వ్యక్తి ఎంత చదువుకున్నాడన్నది కన్నా అతడు ఇతరులతో ఎలా ప్రవర్తిస్తున్నాడన్నది సమాజం ఎక్కువగా గమనిస్తుంది. ఒక సామాజిక సర్వే ప్రకారం ఉద్యోగ నియామకాలలో 58% ప్రాధాన్యం వ్యక్తిత్వానికి, 42% మాత్రమే విద్యార్హతలకు ఇస్తున్నట్లు వెల్లడైంది. మంచి మాట మాట్లాడటం, ఇతరుల బాధను అర్థం చేసుకోవడం, సమయస్ఫూర్తితో నిర్ణయం తీసుకోవడం, సమస్యలను చాకచక్యంగా పరిష్కరించడం ఇవన్నీ లోకజ్ఞానం ద్వారా వస్తాయి. ఉద్యోగాలలో కూడా ఇప్పుడు కేవలం సర్టిఫికెట్లు కాకుండా ప్రవర్తన, నాయకత్వ లక్షణాలు, పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

చరిత్రలో ఎన్నో మహానుభావులు లోకజ్ఞానంతో గొప్ప స్థాయికి చేరుకున్నారు. చాలా మంది శాస్త్రవేత్తలు, నాయకులు, సంస్కర్తలు తమ అనుభవాల నుంచే పెద్ద పాఠాలు నేర్చుకున్నారు. మహాత్మా గాంధీ ప్రజల మధ్య తిరిగి వారి కష్టాలను తెలుసుకున్నాడు. అంబేద్కర్ పుస్తక జ్ఞానంలో మహామేధావి అయినప్పటికీ సమాజంలోని వాస్తవ పరిస్థితులను లోతుగా అర్థం చేసుకున్నాడు. అందువల్లనే వారి ఆలోచనలు ప్రజల జీవితాలను మార్చగలిగాయి. కేవలం గ్రంథాలయాల్లో కూర్చొని ఉంటే అలాంటి సామాజిక అవగాహన సాధ్యమయ్యేది కాదు.

ఇప్పటి సమాజంలో ఒక పెద్ద సమస్య ఏమిటంటే విద్య పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి. పిల్లలు ఎక్కువ సమయం పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. మార్కుల పోటీ పెరిగిపోతోంది. భారతదేశంలోని పట్టణ ప్రాంతాల్లో 2026 నాటికి సుమారు 61% మంది పిల్లలు రోజుకు 5 గంటలకు పైగా డిజిటల్ పరికరాలపై గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ జీవిత నైపుణ్యాలు తగ్గిపోతున్నాయి. పెద్దలను గౌరవించడం, సహనం, సంభాషణ పద్ధతి, సామాజిక బాధ్యత వంటి విలువలు బలహీనపడుతున్నాయి. ఇది లోకజ్ఞానం లోపిస్తున్న సంకేతం. విద్యతో పాటు జీవిత జ్ఞానం కూడా సమానంగా అవసరమని సమాజం గుర్తించాలి.

లోకజ్ఞానం మనిషికి అప్రమత్తతను నేర్పుతుంది. ఎవరు నిజమైనవారు, ఎవరు మోసం చేసే వారు అన్నది గుర్తించే శక్తి ఇస్తుంది. వ్యాపారంలో, రాజకీయాలలో, కుటుంబ జీవితంలో, ఉద్యోగాలలో ఈ జ్ఞానం ఎంతో అవసరం. ఆర్థిక మోసాలపై నిర్వహించిన పరిశోధనల్లో సుమారు 54% మంది ప్రజలు అనుభవం లేకపోవడం వల్లే మోసాలకు గురవుతున్నారని వెల్లడైంది. పుస్తకాల్లో అన్ని మోసాల గురించి వివరాలు ఉండకపోవచ్చు. కానీ అనుభవం మనిషిని జాగ్రత్తగా మార్చుతుంది. అందుకే పెద్దలు “లోకం చూసినవాడు తెలివైనవాడు” అంటారు.

పుస్తక జ్ఞానం లేకపోతే సమాజ అభివృద్ధి ఆగిపోతుంది. అదే విధంగా లోకజ్ఞానం లేకపోతే మనిషి జీవితం అసంపూర్ణంగా మారుతుంది. ఈ రెండింటిలో ఏది గొప్పది అన్న ప్రశ్నకు సరైన సమాధానం - రెండూ అవసరమే. కానీ జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడంలో లోకజ్ఞానం మరింత ప్రభావవంతమవుతుంది. అనేక జీవన నైపుణ్యాల పరిశోధనల ప్రకారం వ్యక్తిగత విజయాలలో 60% వరకు అనుభవాధారిత నిర్ణయాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఎందుకంటే అది నేరుగా జీవితం నుంచే పుట్టుకొస్తుంది. అనుభవం ద్వారా వచ్చిన జ్ఞానం మనిషిలో స్థిరంగా నిలుస్తుంది.

ఒక విద్యార్థి పుస్తకాల్లో విజయ రహస్యాలు చదవవచ్చు. కానీ నిజమైన విజయం సాధించడానికి కష్టపడి పని చేయాలి, అపజయాలను ఎదుర్కోవాలి, మనుషులతో కలిసి నడవాలి. మానసిక శాస్త్ర అధ్యయనాల ప్రకారం విజయవంతమైన వ్యక్తుల్లో దాదాపు 75% మంది అపజయాల నుంచే జీవిత పాఠాలు నేర్చుకున్నామని పేర్కొన్నారు. ఇవన్నీ లోకజ్ఞానం నేర్పే పాఠాలు. అలాగే కుటుంబ జీవితంలో కూడా పుస్తకాల కన్నా అనుభవం ఎక్కువగా ఉపకరిస్తుంది. తల్లిదండ్రులు పిల్లలను పెంచడంలో పుస్తకాల కంటే తమ జీవన అనుభవాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. రైతు, కూలీ, వ్యాపారి, కార్మికుడు, గృహిణి -- వీరిలో చాలామందికి ఉన్న జీవన అవగాహన ఎంతో గొప్పది.

సాంకేతిక యుగంలో సమాచారం విపరీతంగా పెరిగిపోయింది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు వల్ల ప్రపంచ జ్ఞానం చేతిలోకి వచ్చింది. 2026 డిజిటల్ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 402 మిలియన్ టెరాబైట్ల డేటా సృష్టించబడుతోంది. కానీ సమాచారమే జ్ఞానం కాదు. దాన్ని ఎక్కడ ఉపయోగించాలి, ఎలా ఉపయోగించాలి అన్న తెలివి అవసరం. అదే లోకజ్ఞానం. చదివిన ప్రతి విషయం నిజం కాదని తెలుసుకోవడం కూడా లోకజ్ఞానమే. అందువల్ల ఆధునిక కాలంలో ఈ జ్ఞానం మరింత ముఖ్యమైంది.

చివరగా చెప్పాలంటే పుస్తక జ్ఞానం మనిషికి వెలుగు ఇస్తే, లోకజ్ఞానం దారిని చూపిస్తుంది. పుస్తకాలు మనిషిని చదువుకున్నవాడిగా మార్చవచ్చు. కానీ లోకజ్ఞానం ఉన్నప్పుడు మాత్రమే అతడు పరిపక్వుడిగా మారుతాడు. పుస్తకాల ద్వారా విజ్ఞానం పొందిన వ్యక్తి సమాజంతో మమేకమై అనుభవాలను కూడబెట్టినప్పుడు అతడు సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందుతాడు. అందుకే మన పెద్దలు ఎప్పుడూ “లోకం నేర్పిన పాఠం గొప్పది” అని చెప్పారు. జీవితాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే పుస్తకాలతో పాటు లోకాన్నీ చదవాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి

• కలెక్టర్ ప్రియాంక



**మాద్దూర్, మే 27 (జనం సాక్షి) :** జిల్లాలోని కొనుగోలు కేంద్రాల లో ఉన్న ధ్యానం బస్తాలను వెంటనే లారీల్లో లోడ్ చేయించి మిల్లులకు వెంటనే తరలించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం రోజు కలెక్టర్ మద్దూరు మండలం దమ్ గాన్ పూర్ గ్రామంలో గల వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కేంద్రంలోని ధ్యానం తడిసి పోయిందా అని ఆమె అక్కడి నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. బస్తాలలోని ధాన్యాన్ని స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. కొన్ని బస్తాల చివరి భాగం తడిసి పోవడం గమనించిన ఆమె తడిసిన బస్తాలలోని ధాన్యాన్ని మళ్ళీ వేరే బస్తాలలోకి మార్చి లారీల్లో లోడ్ చేయించాలని సివి ల్ సప్లై జిల్లా మేనేజర్ సైదు లుకు సూచించారు. అక్కడి నుంచే కాంట్రాక్టర్ కు ఫోన్ లో మాట్లాడి మద్దూరుమండలం లో ఉన్న ఒక్కో కొనుగోలు కేంద్రాలనికి మూడు లారీల ను తెప్పించి గురువారం సాయంత్రం వరకు కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలను మిల్లలకు తరలించాలని ఆదేశించారు.

# రామంతాపూర్ చెరువుకు కొత్త అందాలు

• రూ.19 కోట్లతో హైడ్రా అభివృద్ధి
• రూ.16 కోట్లతో వరద సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ఉప్పల్, మే 27 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న ముంపు సమస్యలకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రతి వర్షాకాలం వస్తే భయాందోళనలకు గురయ్యే రామంతాపూర్, హబ్సిగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే చర్యలు చేపడుతోంది. రామంతాపూర్ పెద్ద చెరువును భారీ నిధులతో సుందరీకరించడంతో పాటు, వరద నీటి సమస్యను పూర్తిగా నివారించేలా ప్రత్యేక ప్రణాళికతో పనులు కొనసాగుతున్నాయి. బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు హైడ్రా అధికారులతో కలిసి రామంతాపూర్ పెద్ద చెరువును సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో వర్షాకాలంలో ఎదురవుతున్న సమస్యలు, కాలనీల్లోకి చేరుతున్న వరద నీటి పరిస్థితి, నీటి పారుదల మార్గాలు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి దాదాపు రూ.150 కోట్ల నిధులు కేటాయించబడినట్లు తెలిపారు. అందులో భాగంగా



రామంతాపూర్ పెద్ద చెరువును హైడ్రా ఆధ్వర్యంలో రూ.19 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. చెరువును కేవలం నీటి నిల్వ కేంద్రంగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి వేదికగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ విశాలమైన నడక మార్గాలు, అందమైన పచ్చదనం, ఆధునిక విద్యుత్ దీపాలు, కుటుంబాలతో కలిసి విశ్రాంతి తీసుకునే ప్రదేశాలు ఏర్పాటు చేసి చిన్న ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే రామంతాపూర్ ప్రాంతానికి కొత్త అందాలు చేరడంతో పాటు ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

### రూ.16 కోట్లతో వేగంగా ఎస్ఎన్‌డీపీ పనులు

ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంతం నుంచి భారీగా వచ్చే వరద నీటిని సక్రమంగా మళ్లించేందుకు ప్రత్యేకంగా ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టినట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నీటి పారుదల వ్యవస్థ ద్వారా వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో పూర్తయితే కాలనీల్లో నీరు నిలిచిపోయే పరిస్థితులు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. గతంలో ముంపుతో ఇబ్బందులు పడిన ప్రాంతాలు ఇకపై సురక్షితంగా మారనున్నాయని చెప్పారు. "ఇది కేవలం అభివృద్ధి పని మాత్రమే కాదు... ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే కార్యక్రమం. ప్రతి ఏడాది ముంపుతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఇది శాశ్వత ఉపశమనం. ప్రజలు ఇక వర్షాలు వస్తే భయపడాల్సిన అవసరం ఉండదు" అని ఆయన అన్నారు.

### భారీగా హాజరైన స్థానికులు, కాంగ్రెస్ నాయకులు

ఈ కార్యక్రమంలో మహేశ్వరి నగర్, సాయిచిత్ర నగర్, రవీంద్ర నగర్ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరవింద్ రెడ్డి, బాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగిరెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి, బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, గన్నారం విజయ్ కుమార్, గణేష్ నాయక్ మరియు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

**ముషీరాబాద్, మే 27 (జనం సాక్షి) :** కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ బద్ధమైన సంస్థగా జాతీయ బి.సి కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోజాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చలలో ఆర్.కృష్ణయ్య, బి.సి సంక్షేమ సంఘం నాయకులూ పెరికే సురేష్, ఆశిష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర వచ్చి 77 సంవత్సరాలు గడిచిన 56% జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం ఈ కులాల అభివృద్ధి జరగడం లేదు అన్నీ సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు యున్నవి. కానీ



బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం వలన న్యాయం జరుగుతుంది అని తెలిపారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాజీవ్ ఫెలో షిప్ పథకం కింద అర్హులైన పిహెచ్డి స్కాలర్స్ అందరికీ స్టై ఫండు మంజూరు చేయాలని, గురుకులపాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని సాధ్వి నిరంజన్ జ్యోతిను కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు.

### కేంద్రానికి సిఫార్సు చేస్తామని హామీ

బీసీల డిమాండ్లు న్యాయమైనవని, ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారు. తెలుగు రాష్టాలు అమలు చేస్తున్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు దేశమంతా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారన్నారు.

## మిల్లులో ధాన్యం దిగుమతికి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

• సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి
• దిగుమతి ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలన



**చేర్యాల, మే 27 (జనంసాక్షి) :** మిల్లులో వరిధాన్యం దిగుమతికి యుద్ధ ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో శివసాయి బాలాజీ రైస్ మిల్, ముస్యాల గ్రామ శివారులోని శ్రీ రేణుక బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో దిగుమతి ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లులలో దాదాపు 30 వాహనాల ధాన్యం దిగుమతికి తయారుగా ఉందని వాటిని యుద్ధ ప్రతిపాదకన దిగుమతి చేసుకోవాలనీ, మిల్లులో దిగుమతి జాప్యం కావడం వల్లే కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడిందని దయచేసి ఎక్కువ పాయింట్లు పెట్టి వాహనాల దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని మిల్లర్ యజమానులను తెలిపారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను సమకూర్చుకుని ఎక్కడ కొనుగోలు కేంద్రాల్లో అక్కడ హమాలీలు పనిచేస్తే మిల్లులో దిగుమతికి ఆలస్యం కాదని ఈ బాధ్యతను, అలాగే ధాన్యం దిగుమతికి పలు గోదాములను అన్వేషణ చేయాలని స్థానిక తహసీల్దార్ చూసుకోవాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి కాగానే మిల్లర్ అక్నాలెజ్మెంట్, ట్రక్ షిట్ జెనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్ ఉంచకుండా వెంటనే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్ నాయక్ తదితరులు ఉన్నారు.

## పేదల ఇళ్లపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు



**బోడుప్పల్, మే 27 (జనంసాక్షి) :** మాజీ మంత్రి కేటీఆర్ ఇందిరమ్మ ఇండ్లపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మండిపడ్డారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మేడ్చల్ జిల్లా బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్,ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ... పేదలకు ఇళ్లు ఇస్తుంటే కేటీఆర్‌కు ఎందుకు ఇంత కడుపుమంటో ప్రజలకు అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేరుతో మోసం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుంటే వాటిపై విమర్శలు చేయడం దౌర్భాగ్యం. ప్రజల సమస్యలు చూడకుండా రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేయడం కేటీఆర్‌కు అలవాటైపోయింది" అని ఘాటుగా విమర్శించారు. "బీఆర్ఎస్ హయాంలో వేలాది మంది పేదలు ఇళ్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఇండ్ల కేటాయింపులు చేస్తోంది. పేదల ఆనందాన్ని కూడా జీర్ణించుకోలేక కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్,దయ్యాల అలివేలు,రాహుల్,యువజన నాయకులు అసర్ల బీరప్ప,జన్నె రాజు, అంబాల అరవింద్ గౌడ్ పాల్గోన్నారు.

## ఖాదీ బోర్డు కాలనీలో హైడ్రా

• కబ్జాదారు గుండెల్లో గుబులు
• పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హయత్‌నగర్, మే 27 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ హయత్ నగర్, ఖాదీ బోర్డు కాలనీ, సర్వే నంబర్లు 233, 234, 235, 236 పరిధిలో ఉన్న మా కాలనీ 1984 సంవత్సరంలో లేఅవుట్ చేయబడింది. ప్లాట్ నంబర్లు 69, 70, 47, 48 ప్రాంతం మొదటి నుంచే కాలనీ పార్క్‌గా ఉపయోగించబడుతూ వస్తోంది. గత నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రదేశంలో గణేష్ నవరాత్రులు, అమ్మవారి పూజలు, బతుకమ్మ పండుగలు, జెండా వందనం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలనీ ప్రజలు ఎంతో ప్రేమతో ఈ పార్క్‌ను కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఇటీవల కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఫేక్ డాక్యుమెంట్ల ఆధారంగా ఈ నాలుగు ప్లాట్లు తమవి అని చెప్పి, మార్చి 24న రిజిస్ట్రేషన్ చేసుకున్నామని పేర్కొంటూ కాలనీలోకి వచ్చి పార్క్ బోర్డులు, ప్రీకాస్ట్ నిర్మాణాలు, జెండాలకు సంబంధించిన ఏర్పాట్లు ధ్వంసం చేశారు. దీంతో కాలనీ ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంలో మేము సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు వెంటనే స్పందించి పూర్తి వివరాలు, డాక్యుమెంట్లు పరిశీలించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎంతో బాధ్యతతో వ్యవహరించి,



కాలనీ ప్రజలు, కొనుగోలు చేసిన వారిని పిలిపించి సమావేశం నిర్వహించారు. వారి డాక్యుమెంటేషన్‌లో లోపాలు ఉన్నాయని స్పష్టంగా తెలియజేసి, అక్రమంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించే చర్యలు తీసుకున్నారు. పార్క్ చుట్టూ తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు న్యాయం చేశారు. 42 సంవత్సరాలుగా ఈ స్థలం ఎప్పుడూ రిజిస్ట్రేషన్ కాలేదని, ఈసీ తీసినా "నిల్" గానే వచ్చిందని అందరికీ తెలుసు. అలాంటి స్థలాన్ని అకస్మాత్తుగా రిజిస్ట్రేషన్ చేయడం చాలా అనుమానాస్పదం. వ్యవస్థలోని కొన్ని లోపాలను ఉపయోగించుకుని ఇలాంటి పనులు చేసిన వారిపై సరైన చర్యలు తీసుకోవాలని మేము కోరుకుంటున్నాం. మా కాలనీకి ఉన్న ఏకైక పార్క్‌ను కాపాడి, మా సమస్యను మర్యాదపూర్వకంగా, వేగంగా పరిష్కరించిన హైడ్రా అధికారులకు, కమిషన రంగనాథ్ లకు కాలనీ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. మీ సహాయం వల్ల మా కాలనీ ప్రజలకు ఎంతో న్యాయం జరిగిందని కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ ధ్యేయం



**షాబాద్, మే 27 (జనం సాక్షి) :** రైతులు సబ్సిడీపై వచ్చిన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించి లాభసాటి వ్యవసాయం చేయాలని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పిఎసిఎస్ కో - ఆపరేటివ్ సొసైటీలో బుధవారం పచ్చి రొట్టె విత్తనాలు, జనము, పచ్చి రొట్టె ఎరువు విత్తనాలు సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... జనుము విత్తనాలు క్వింటాలుకు 15,500 రూపాయలు ఉండగా సబ్సిడీపై రైతులకు 7775 రూపాయలకు అందిస్తున్నట్లు అలాగే జిగులు విత్తనాలు క్వింటాలకు 16350 రూపాయలు ఉండగా సబ్సిడీ 8175 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. అధిక రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గి, దిగుబడులు క్షీణిస్తున్నాయని అన్నారు. పచ్చి రొట్టె జనుము, జిలుగు విత్తనాల ఎరువులను సాగు చేసి భూసారాన్ని మరియు పంట దిగుబడులను పెంచుకోవచ్చు అని అన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, కో-ఆపరేటివ్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఎంపీడీవో అపర్ణ, డిప్యూటీ తాసిల్దార్ మధు, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీని సందర్శించిన అదనపు కలెక్టర్

**మల్దకల్, మే 27 (జనంసాక్షి) :** మల్దకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్నిబుధవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సందర్శించారు. పింఛన్ దారులతో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ,అదనపు కలెక్టర్ నర్సింగరావు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్లలబ్ధిదారులను ఫోటోలను ఆయన దింపారు. వృద్ధాప్య,వితంతువు, వికలాంగుల పెన్షన్లు,ఒంటరి మహిళ పెన్షన్,చేనేత,బీడీ కార్మికులు,కల్లుగీత కార్మికులు ఆసరా పింఛన్లు వస్తున్న వారందరినీ గ్రామపంచాయతీకి వెరిఫికేషన్ కొరకు



పెన్షన్ అతంటిఫికేషన్ అనగా ఆధార్ కార్డు ఫోటో దింపడం జరిగింది. మల్దకల్ గ్రామపంచాయతీకి కార్యాలయంలో వచ్చి ఆధార్ కార్డు ఫోటోను దిగిపోవాలని కోరారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోండి

• సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్
• కొనుగోలు కేంద్రాలను సందర్శించిన సీపీఐ నాయకులు

**చేర్యాల, మే 27 (జనంసాక్షి) :** మండలంలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి గోదాములకు, రైస్ మిల్లులకు తరలించాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వడ్లు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి 20 నుంచి 30 రోజులవుతోందని, ఇంత వరకు వడ్లను తూకం చేయడం లేదని అన్నారు. తూకం చేసిన వడ్లను మిల్లర్లు గోదాములకు



తరలించే వరకు రైతులదే బాధ్యత అని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అనడంతో రైతులు ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. అరికారుల నిర్లక్ష్యమో, ప్రభుత్వ నిర్లక్ష్యమో కానీ వెను వెంటనే కొనుగోళ్లు చేపట్టకపోవడం కారణంగా వర్షాకాలం ప్రారంభం కావడంతో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలి వానతో కురిసిన వర్షానికి వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన వరి ధాన్యం నోటి కాడికి వచ్చిన బుక్క నేలపాలు కావడంతో రైతులకు ఎంతో నష్టం వాటిల్లిందని అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. గాలి దుమారానికి నేలారాలిన మామిడి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పోషబోయిన పరమశేఖర్, కడుదూరి పుల్లయ్య, రైతులు సూర రాజు, బైకని యాదయ్య, రేసు పావని, ప్రేమ్ కుమార్, రాజు, మల్లేశం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వీవోఏలకు ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలి

చేవెళ్ల, మే 27 (జనంసాక్షి) : వీవోఏల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని వివోఏల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి ప్రమీల, మండల సలహదారుడు చంద్రశేఖర్, కోశాధికారి జ్యోతి తెలి పారు. వీవోఏల సమ్మెలో భాగంగా బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనం ముందు 10వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వీవోఏలకు ప్రతి నెల రూ.20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంలో వీవోఏల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పద్మ, అస్రాబేగం, సుశీల, మంజుల, మాధవి, హేమలత, లలిత, సుజాత, కవిత, స్వప్న, శిరీష, జంగయ్య, అమృత, నిర్మల, అనిత, కవిత తదితరులు ఉన్నారు.

# పని ప్రదేశాలలో మహిళలను వేధిస్తే వ్యతిరేకించాలి

**గద్వాల నడిగడ్డ, మే 27 (జనం సాక్షి) :** పని ప్రదేశాలలో మహిళలను వేధిస్తే వ్యతిరేకించాలని సిడిపిఓ ఆకాశ దీప్తి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండల ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ఉమెన్స్ వీక్ సెలెబ్రేషన్స్‌లో భాగంగా పని ప్రదేశంలో మహిళల రక్షణ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఆకాశ దీప్తి సీడీపీఓ హాజరు అయ్యి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన లేదా లైంగిక వేధింపులు జరిపించిన,వేధింపుల పరిష్కారానికి 2013 నుంచి అమలులోకి రావడం జరిగిందనీ,పని ప్రదేశంలో ఏ మహిళ అయినా వేధింపులకు గురైతే మొదటి నుంచే వ్యతిరేకించాలి అంతే కానీ నాకెందుకులే అనుకుంటే సమస్య పెద్దగా మారుతుందనీ, ఈ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013 ప్రకారం ఏ కార్యాలయం లోనైనా పది మంది సభ్యుల కంటే ఎక్కువగా ఉన్నటలయితే అయొక్క కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీ ని ఏర్పాటు చేయాలనీ, ఈ కమిటీకి ఏ కార్యాలయంలోని ఎవరైతే సీనియర్ మహిళ ఉంటారో ఆ వ్యక్తి




ఇంటర్నల్ కమిటీకి ఛైర్పర్సన్‌గా వ్యవహరిస్తారనీ, ఈ కమిటీ ద్వారా ప్రతి పని ప్రదేశంలో ఉద్యోగుల పట్ల షీ బాక్స్ పోర్టల్ అందుబాటులో ఉంటుందనీ, దీని ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు పరిష్కార మార్గం సులభతరం అవుతుందనీ,ఈ చట్టం ప్రకారం షీ బాక్స్ పోర్టల్ అందుబాటులో ఉంచడం ద్వారా మహిళలకు భద్రత, రక్షణ కల్పించడం జరుగుతుందనీ, ఈ చట్టం ప్రకారం జిల్లా స్థాయిలో లోకల్ కమిటీ అందుబాటులో ఉంటుందనీ, ఇంటర్నల్ కమిటీ పని తీరును జిల్లాలో స్థాయిలో లోకల్ కమిటీ పర్యవేక్షించడం జరుగుతుందనీ,ఈ చట్టం ద్వారా మహిళలు ఎక్కడ పనిచేస్తున్న సురక్షితమైన వాతావరణం కల్పించబడుతుందని తెలియజేశారు. తర్వాత బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాలు నిండని అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం జరిపించకూడదనీ,ఈ చట్టం గ్రామ స్థాయి నుంచి జిల్లాలో స్థాయి వరకు కూడా బాల్య వివాహ నిరోధక అధికారులను నియమించి బాల్య వివాహాలను నిర్మూలిస్తున్నదనీ, 18 సంవత్సరాలు నిండని పిల్లలలో ఎదుగుదల ఉండదు ఆలోచించే విధానం తక్కువగా ఉంటుందనీ,ఒక బాల్య వివాహం జరిపిస్తే లక్ష రూపాయల జరిమానా లేదా రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందనీ, చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని, అలాంటి సమాచారం తమకు అందించాలని ఆమె కోరారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ ఫోన్ వారి చేతికి ఇచ్చినట్లయితే దాని ద్వారా పిల్లలు చాలా ప్రమాదాలు ఎదుర్కోవడం జరుగుతుందన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, ఇచ్డ్స్ సూపెర్వైసర్లు వెంకటేశ్వరమ్మ, సురేఖ, సునీత, ఆర్డీఎస్ ఎన్జీవో ధనలక్ష్మి, ఎంపీడీఓ ఆఫీస్ సిబ్బంది,మహిళా సమాఖ్య లీడర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, మే 27 (జనం సాక్షి) :** మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్డీ లేని రుణాలను అన్ని మహిళా సంఘాల సభ్యులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి,మున్సిపల్ ఛైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ శివాజీ, మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్ గౌడ్,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, మెప్మా అధికారులు, మహిళ సంఘాల సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**అచ్చంపేట, మే 26 (జనం సాక్షి) :** నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండలం కొండనాగుల గ్రామంలో బుధవారం ఉదయం రైతు వేదిక వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యం తడవడంతో రైతులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నేరుగా కొనుగోలు కేంద్రానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ ఉంచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ధాన్యం తూకం, నిల్వ, తరలింపు ప్రక్రియలపై అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు పడకుండా గన్నీ



సంచులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేసి బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి తాహసిల్దార్ శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనాలంటూ రోడ్డుపై బైఠాయించిన రైతులు

**తూప్రాన్, మే 27 (జనం సాక్షి) :** అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ తూప్రాన్ ఐకేపీ సెంటర్ వద్ద రైతుల ఆగ్రహం చెలరేగింది. కొనుగోలు కేంద్రంలో రోజులు గడుస్తున్నా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం, లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతుండటంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో రైతులు ఐకేపీ సెంటర్ వద్ద చేరుకొని రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. “పంట పండించడానికి అప్పులు చేసి కష్టపడ్డాం.. ఇప్పుడు ధాన్యం తడిసి నష్టపోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదు” అంటూ రైతులు మండిపడ్డారు. వర్షం పడే అవకాశం ఉన్నప్పటికీ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోవడం, సరిపడా లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ధాన్యం రాశులు పూర్తిగా తడుస్తున్నాయని రైతులు ఆరోపించారు. ఇప్పటికే కొన్ని ధాన్యం కుప్పల్లో మొలకలు వచ్చే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల నిరసనతో కొంతసేపు తూప్రాన్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు పై రైతులు బైఠాయించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం రెవెన్యూ



ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే లారీలు ఏర్పాటు చేసి సీరియల్ ప్రకారం ధాన్యం లోడింగ్ ప్రారంభించారు. అనంతరం ధాన్యాన్ని గోదాములకు తరలించే చర్యలు చేపట్టడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ఎదురవుతోందని, కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం వల్ల రైతులే నష్టపోతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే అన్ని కొనుగోలు కేంద్రాల్లో లారీలు, టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కబ్జాల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలి



**ఉర్కొండ, మే 27 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూములు అన్యాకాంతం అవుతున్నాయని వెంటనే కబ్జాల నుండి భూములు కాపాడాలని మండల తహసిల్దార్ యూసుఫ్ అలీ కి వినతి పత్రం అందజేశారు .ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ భూములు అక్రమంగా కబ్జాకు గురవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని గ్రామసభలో తీర్మానించి, అనంతరం ఆ పత్రాన్ని తహసిల్దార్ యూసుఫ్ అలీకి అందజేశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ఆక్రమిత భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని రామ్ రెడ్డి పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా పనులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**అచ్చంపేట, మే 26 (జనం సాక్షి) :** నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండలం లోని కొండనాగుల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్డు చదును పనులను హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనుల పురోగతిని ఆయన నేరుగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండనాగుల గ్రామం లో పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కూలీలతో ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ హాజరు నమోదు, కూలి చెల్లింపులు సమయానికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడి పనిస్థలాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న రోడ్డు చదును, చెరువుల అభివృద్ధి, వాననీటి సంరక్షణ వంటి పనులు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.



పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి పనిని పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్తులు కూడా పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్రామ రహదారుల అభివృద్ధితో రాకపోకలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి తాహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లా ఘనపురం, మే 27 (జనం సాక్షి) :** రైతులు పండించిన వడ్లను సకాలంలో కొనకపోవడంతో అకాల వర్షాలకు నష్టపోతున్న రైతులను ఎవరు ఆదుకుంటారు అని ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని యధావిధిగా కొనుగోలు చేయాలని ఉప్పరపల్లి,మల్కాపురం,గట్టు కాడి పల్లి లలో బుధవారం వారి కొనుగోలు కేంద్రాలను స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు తో కలసి పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు అనంతరం ఆయా గ్రామాల రైతులతో కలసి వడ్ల కొనుగోలు కేంద్రాల లో తడిసిన ధాన్యాన్ని పరిశించడం జరిగింది . ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ,,, రైతులపై కపట ప్రేమ విడి తడిసిన ప్రతి ధాన్యపు గింజలను సర్కారే కొనాలని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు అలాగే వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుంది మిల్లర్ల తో కలిసి కొందరు నాయకులు కుమ్మక్కై చేస్తున్న అక్రమాలను సంబంధిత అధికారులు గుర్తించి వారిపై తగిన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు , బస్తా కు మూడు నుండి నాలుగు కిలోల తరుగు పేరిట తీస్తున్నారంటే ఎవరి అండదండలతో వారు ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు ,రైతుల ఉసురు పోసుకున్న వారు ఎవ్వరు కూడా మనుగడ సాగించలేరని ఈ సందర్భంగా మాజీ మంత్రి తెలిపారు. ఆయన వెంట మాజీ ఏం పీపీ కృష్ణ నాయక్,బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, పురందర రెడ్డి , షాపూర్ మన్యం గౌడ్, ఘనపురం వార్డు సభ్యులు పోలిశెట్టి ప్రతాప్, పిన నాయక్,నందిమల్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## సాగునీటి ప్రాజెక్ట్‌లను వేగవంతంగా పూర్తి చేస్తాం

**కొల్లాపూర్/నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మే 26 (జనంసాక్షి) :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి పూర్తి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌తలో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్, ప్యాకేజీ 3 వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా చేయడానికి, సమస్యల పరిష్కారం, అవాంతరాలను తొలగించడానికి ప్రాజెక్ట్ లను సందర్శించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయాలి
- బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్

**పెబ్బేరు, మే 27 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలులో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలం అయిందని బిసి పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మండిపడ్డారు. బుధవారం పెబ్బేరు మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ తీరుతో ప్రభుత్వశీ అప్రతిష్ట పాలవుతుందన్నారు. రైతులు ఎన్ని ఎకరాలలో వరి పంట పండిస్తున్నారో, ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందో, వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎక్కడ దింపుకోవాలో అనే ముందస్తు నివేదికలు లేకుండానే డిఎస్ఓ గుడ్డిగా వ్యవహరించడం వల్ల నేడు రైతులు హరిగోస పడుతున్నారని దుయ్యబట్టారు. కమిషన్ల కోసం పనిచేస్తున్న డీఎస్ఓ పైసలతో బియ్యం బుక్కుతారా? అనే సందేహాన్ని వెలిబుచ్చారు. 100% సీఎంఆర్ బకాయిలు చెల్లించిన మిల్లులకు ధాన్యం కేటాయించాలని స్వయానా డైరెక్టర్ చెప్పినా జిల్లాలో అమలు కావటం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ గారు మేల్కొని జిల్లాలో 100% సీఎంఆర్ బకాయిలు చెల్లించిన 36 రైస్ మిల్లులకు అనుమతులు ఇచ్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను తక్షణమే పరిష్కరించి, తడిసిన ప్రతి గింజలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇంత జరుగుతున్న డీఎస్ఓను కలెక్టర్ వెనకేసుకురావడంలో ఆంతర్యం ఏమిటని తక్షణమే జిల్లా కలెక్టరును బదిలీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకముందే సమీక్షలు నిర్వహించాల్సిన మంత్రి, ఎమ్మెల్యేలు ఇప్పుడు సమీక్షలు నిర్వహిస్తే ఏం లాభమని నిలదీశారు. డీఎస్ఓను సస్పెండ్ చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించినప్పటికీ తన ఆదేశాలను సైతం కలెక్టర్ బేఖాతారు చేస్తుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని అసహనం వ్యక్తం చేశారు. స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ నుంచి అండర్ టేకింగ్ అనుమతి తీసుకోకుండానే, మిల్లులలో ఫంక్షన్ హాళ్లలో ధాన్యం దిగుమతి చేయడం వెనుక బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఇటీవలే జిల్లాలో రెండు రైస్ మిల్లులలో దాదాపు రూ.9 కోట్లకు పైగా ధాన్యం బస్తాలు మాయమైన సంగతి ఆయన గుర్తు చేశారు. మరి ముఖ్యంగా ట్రాన్స్ పోర్ట్ విషయంలో జిల్లా



యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, జిల్లాలోని తొమ్మిది సెక్టార్లకు సంబంధించి లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టు కేటాయించడంలోనే అతిపెద్ద కుంభకోణం చోటు చేసుకుందని, కుంభకోణం వెనుక అందరి హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు కలెక్టరుకు తెలియకుండానే ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టు అప్పగించారా అంటూ, 9 సెక్టార్లలో కలిపి 360 లారీలు చూపిస్తారా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు వివి గౌడ్, శ్రీధర్ రెడ్డి, అఫ్రోజ్, ధర్మేంద్ర సాగర్, హనుమంత్ రెడ్డి, రామన్ గౌడ్, రమేష్, రాజగౌడ్, ఆస్కని రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 27(జనంసాక్షి ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కెరమెరి మండలం కొఠారి గ్రామాన్ని సందర్శించనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లతో కలిసి గ్రామంలో పర్యటన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, మండల నాయకులతో సమావేశమై పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. గ్రామంలోని కొలాం ఆదివాసీల కోసం ప్రభుత్వం నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. అలాగే కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు సుగుణక్క పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** పంట కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రకియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం సాత్నాల మండలం మేడిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వస్తున్న పంట దిగుబడులు, ప్రస్తుత కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై ఆయన అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యార్డ్‌లో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తూ, మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలు వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి రామ్ ప్రసాద్, తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపిడిఓ వెంకటరాజు ,ఏవో రాథోడ్ కైలాష్, సర్పంచ్ లక్ష్మీ భాయి, స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలు పెంచాలి

- ఎమ్మెల్యే డా. మురళి నాయక్



**మహబూబాబాద్ బ్యూరో, మే27(జనం సాక్షి):** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అనవసర శస్త్ర చికిత్సలు ( సిజేరియన్లు) తగ్గించి సాధారణ ప్రసవాలు ( నార్మల్ డెలివరీలు) పెంచేందుకు కృషి చేయాలని వైద్యులను ఎమ్మెల్యే డాక్టర్.మురళీ నాయక్ ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి అన్ని వార్డుల్లో కలియ తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకొని అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధిత వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించేందుకు తన సొంత నిధులను హెచ్చిస్తానన్నారు. ఇటీవల ఆసుపత్రిలో రోగి వెంకన్న మృతి చెందిన తీరు పై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక మౌలిక సదుపాయలు, నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా రోగులకు నమ్మకాన్ని పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో మృతి చెందే రోగుల పై సంబంధిత అధికారుల తో ప్రతి నెల సమీక్ష సమావేశం నిర్వహిస్తానని వెల్లడించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని,లేని యెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాసరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లకావత్, ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్, వైద్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 27(జనంసాక్షి) :** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, తేమ శాతం నమోదు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వ విధానం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, నీడ, వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగంగా కొనుగోలు చేసి, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, కవర్లు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు డబ్బుల చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచే యాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం క్రిష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు, పిఏసిఎస్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్

- ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- దొంగలించిన బంగారం విలువ 46,46,600 లక్షలు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతః రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుదవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంటిలో జరిగిన చోరీ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకొని సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి విచారణ చేపట్టడం జరిగిందన్నారు.దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలో దొంగలించిన స్విఫ్ట్ డిజైర్ కారుకు ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చడంతో పాటు ఫేక్ ఫాస్ట్ ట్యాగ్ ఉపయోగించి రాష్ట్రాల మధ్య సంచరిస్తూ పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు గుర్తించామన్నారు. నిందితులు ఈ నెల 23వ తేదీన రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకొని శాంతినగర్ ప్రాంతంలో చోరీకి పాల్పడిన తర్వాత అదే రాత్రి ఆర్మూర్ ఇందలవాయి బస చేసి, మరుసటి రోజు కామారెడ్డి జిల్లాలో చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం 25వ తేదీన హైదరాబాద్ ప్రాంతంలో సంచరించి, 26వ తేదీన వరంగల్ కమిషనరేట్, కాజీపేట పరిధిలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో భారీ చోరీలకు పాల్పడ్డారు. ముగ్గురు నిందితులు గతంలో హత్య, హత్య యత్నం, రాబరీ, చైన్ స్నాచింగ్ తదితర తీవ్రమైన నేరాలలో కూడా పాల్గొన్న కరడుగట్టిన నేరస్తులుగా, ఎన్నో సార్లు జైలుకు వెళ్లినట్టు గుర్తించడం జరిగింది.ఈ నిందితులను బుదవారం ఉదయం 8 గంటలకు స్థానిక సిసిఐ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆపకుండా పారిపోతున్న సమయంలో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. దొంగతనం చేసిన బంగారం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ 46,46,600 లక్షల విలువ చేస్తుందని తెలిపారు. 331.900 గ్రాముల బంగారు ఆభరణాలు, 718.700 గ్రాములు వెండి ఆభరణాలు, స్విఫ్ట్ డిజైర్ కారు, రూ 15,200 నగదు, 4 సెల్ ఫోన్లు, 2 ఇనుప రాడ్లు, ఒక డ్రిల్లింగ్ రాడ్, ఒక కట్టింగ్ ప్లేయర్, 2 ఫేక్ నెంబర్ ప్లేట్లు, 1 టపారియా స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 382/2026 సెక్షన్లు 331(4), 305(ఏ) బీఎన్ఎస్ ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 60.700 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కాజీ పేట పోలీస్ స్టేషన్, ప్రశాంత్ నగర్, నీట్ ప్రొఫెసర్ ఇంట్లో.క్రైం నెం. 128/2026, సెక్షన్లు 331(4), 305(ఏ) దీఈూ ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 270.700 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు 718.700 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం. అదే విధంగా సుబేదారి పోలీస్ స్టేషన్,విజయ్ పాల్ కాలనీ వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో 282/2026 సెక్షన్లు 331(4), 305(ఖ) దీఈూ ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 1.900 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం. ఇంకా కామారెడ్డి పోలీస్ స్టేషన్, కామారెడ్డి జిల్లా క్రైం నెం. 417/2026 సెక్షన్లు 331(4), 305(ఖ) దీఈూ ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 4.600 గ్రాముల బంగారు ఆభరణాలు, స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.ఈ అంతః రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి భారీ మొత్తంలో చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, రమేష్, హనుమంతు, సట్ల శ్రీను, జాకీర్, ఆర్ఎస్ రమేష్, రుక్మారెడ్డి, రాహత్ ఐటి కోర్ సిబ్బంది ఆర్ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ త్రిశూల్ ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్, ఆర్.ఎస్.ఐ గోపి, ఎస్ఐలు అశోక్, సంజయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద
- ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



**చెన్నారావుపేట, మే 27( జనం సాక్షి) :** అటవీ భూముల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు.బుధవారం చెన్నారావుపేట మండలంలోని జల్లి, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం గ్రామాల పరిధిలో ఉన్న అటవీ భూముల సమస్యలను అటవీ శాఖ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పరిశీలనలో జిల్లా అటవీ శాఖ అధికారి నికిత, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణిలు పాల్గొన్నారు.భూముల హక్కులు, సాగు పరిస్థితులు, స్థానిక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భనలో డిసిఓ నీరజ, చెన్నారావుపేట మండల తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, గ్రామాలలోని రైతులు, అటవీ, రెవెన్యూ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. చెన్నారావుపేట, జోజిపేట నారాయణ తండా, పాత ముగ్ధంపురం, ముగ్ధంపురం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకం, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని కోరారు.

# మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, మే 27 (జనంసాక్షి):** పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని, మహిళలు వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారంప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కార చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు తమ రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, పిల్లలకు చిన్నప్పటి నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం నేర్పించాలని అన్నారు. షీ టీం ప్రతినిధి సుజాత మాట్లాడుతూ మహిళలపై ఎక్కడైనా వేధింపులు జరిగినట్లయితే షీ టీంను 8712685142 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం షీ బాక్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2013లో పోష్ చట్టాన్ని అమలు చేసిందని తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు జిల్లా స్థాయి కార్యాలయాల్లో 59, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో 59, ప్రైవేట్ సంస్థల్లో 26 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డీఎల్ఎస్ఏ అడ్వకేట్ సురేష్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల కేసుల్లో గోప్యత పాటిస్తూ విచారణ చేపట్టాలని, ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలని వివరించారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలకు జరిమానాలు విధించే నిబంధనలు ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోష్ చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేయడమైనది.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డిబిసిడిఓ పుష్పలత, డీఆర్డీఏ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇప్పుడు బాగుంది... ట్రాఫిక్ సమస్య తీరింది

- పోలీసుల చర్యపై వరంగల్ ప్రజల హర్షం



**వరంగల్ బ్యూరో, మే 27 ( జనం సాక్షి) :** నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిసరాలు, సికెఎం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై నెలకొన్న ట్రాఫిక్ సమస్యలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. కొంతకాలంగా సికెఎం హాస్పిటల్ మార్గంలో చిరు వ్యాపారులు, పూల దుకాణాల నిర్వాహకులు రోడ్డును ఆక్రమించి శాశ్వత, తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా పోలీసులు రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సికెఎం హాస్పిటల్ వరంగల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కీలక వైద్య కేంద్రంగా కొనసాగుతోంది. ప్రతిరోజూ వందలాది మంది రోగులు, గర్భిణీలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు ఆసుపత్రికి చేరుకుంటుంటారు. అయితే హాస్పిటల్ ప్రవేశ ద్వారం వద్ద పూల దుకాణాలు, బండ్లు, ఇతర వ్యాపారాలు రహదారిని ఆక్రమించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా ఆసుపత్రికి చేరుతున్న ఘటనలు చోటుచేసు కున్నాయి. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి.

### ప్రజల ఫిర్యాదులకు స్పందించిన పోలీసులు

నిత్యం ట్రాఫిక్ సమస్య వల్ల కలుగుతున్న బాధల గురించి స్థానిక ప్రజలు, రోగుల బంధువులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన ఆక్రమణలను తొలగిస్తూ రహదారిని ఖాళీ చేయించారు. దీంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

### పోలీసుల చర్యపై ప్రశంసలు

ప్రాణాలతో పోరాడే రోగులకు ప్రతి నిమిషం విలువైనదని, అలాంటి ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలు అసలు అనుమతించకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమయానికి స్పందించి చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను స్థానికులు అభినందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలు మళ్లీ జరగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కోరుతున్నారు.

### జిల్లా కలెక్టర్‌ను కలిసిన హనుమకొండ ఆర్డీవో వెంకటేష్



**హనుమకొండ ప్రతినిధి, మే 27 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్ బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ములుగు ఆర్డీవోగా విధులు నిర్వహించిన వెంకటేష్ బదిలీపై హనుమ కొండ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌కు కార్యాలయ ఉద్యోగులు, అధికారులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

### వి హబ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



**హనుమకొండ ప్రతినిధి మే 27 (జనంసాక్షి) :** దామెర మండలం మండలం ల్యాదేల్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వి హబ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను అధికారులతో కలిసి పరకాల శాసన సభ్యులు రేవుల ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే పరకాల ఇందిరా మహిళా సమాఖ్య బిల్డింగ్ కు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.మహిళలు అభివృద్ధి సాధించేందుకే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధికి ముందుకు సాగాలి అన్నారు. మహిళా సాధికారితే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శీను మరియు సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బమ్మెరలో రైతుల రాస్తారోకో

**పాలకుర్తి, మే 27(జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లో కొనుగోళ్లలో జాప్యం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని బమ్మెర గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో చేశారు. పాలకుర్తి, స్టేషనఘన్పూర్ రహదారిపై బమ్మెర బస్టాండ్ వద్ద రైతులు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రాకపోకలకు స్తంబించి పోయాయి. ధాన్యాన్ని సకాలంలో కాంటా వేయడం లేదని, కొనుగోలు కేంద్రాలకు లారీలు ధాన్యాన్ని తరలించిన లారీ నాలుగు రోజులకు వస్తున్న పరిస్థితి ఉందని రైతులు పేర్కోన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్. మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య. మండల సమన్వయ సభ్యుడు జోగు గోపి, బత్తిని మదన్, జిట్టబోయిన కోంరెల్లి, జంపాల రాజు, బత్తిని దేవయ్య, జోగు అంజయ్య, బంకం కొండయ్య, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
28 మే 2026

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**• జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**




**నల్లగొండ ప్రతినిధి, మే 27 (జనం సాక్షి) :** బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ వారం నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలో మహిళ ,శిశు ,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం--2006"పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి, బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలి, బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలు దెబ్బతింటున్నాయి, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని అన్నారు.విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని, బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు క్యారంస్ ఆడుతుండగా వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు.అవగాహన కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సి డి పిఓ లావణ్య ,సి డబ్ల్యూ సి చైర్మన్ చింత కృష్ణయ్య ,సి డబ్ల్యూసి సభ్యులు భాస్కర్ వెంకన్న, డిసిపిఓ గణేష్ హాజరయ్యారు.

## అంతరాష్ట్ర సరిహద్దులో పోలీసు కట్టడి ముట్టడి కార్యక్రమం



**చింతలపాలెం, మే 27 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, భద్రత కల్పించడం లక్ష్యంగా,బక్రీద్ పండుగ సందర్బంగా గోవులు,పశువుల అక్రమ రవాణా నిరోధంలో భాగంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు చింతలపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిచింతల ప్రాజెక్ట్ వద్ద అంతరాష్ట్ర సరిహద్దులో పోలీసు కట్టడి ముట్టడి,నాకాబంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ప్రతి వాహనాన్ని, వ్యక్తిని తనిఖీ చేశామని ఎస్ఐ పరమేష్ తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీసు సేవలు అందిస్తున్నామని ,పోలీసు అంటే ధైర్యం,భరోసా అని అన్నారు.అంతరాష్ట్ర సరిహద్దులో అక్రమ రవాణా అసాంఘిక కార్యకలా పాలు అనుమానిత వ్యక్తుల కదలికల నిర్మూలన లక్ష్యంగా కట్టడి ముట్టడి కార్యక్రమం నిర్వహించి ప్రతి వాహనా న్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశామని,దొంగ తనాల నివారణ కోసం కృషి చేస్తున్నాం అన్నారు.ఈ తనిఖీల్లో భాగంగ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాం,పశు వులు,గోవుల అక్రమ రవాణాపై నిఘా ఉంచాం,పేలుడు సామాగ్రి,మారణా యుధాల తరలింపు,గంజాయి లాంటివి రవాణా చేసిన వ్యక్తులు మళ్లీ సంచరిస్తునారా అనేది నిఘా పెట్టి జరుగుతుందా అని పరిశీలించడం జరిగినది.గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని హెచ్చరించారు.

## దారి లేకుండానే నవాబుపేటలో వైకుంఠధామం నిర్మాణం




**చిగురుమామిడి, మే 27 (జనంసాక్షి) :** లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన వైకుంఠధామానికి దారి లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని నవాబుపేట గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వంలో ఉన్న సమస్యలు నూతన ప్రభుత్వం రాగానే తీరుతాయనుకున్న గ్రామస్తులకు నిరాశే మిగిలిందని,ప్రభుత్వం మారిన,పాలక వర్గం మారిన సమస్య మాత్రం అలాగే ఉందని చిగురుమామిడి బీజేపీ పార్టీ మండల కార్యదర్శి, గ్రామ శక్తి కేంద్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో ఏండ్లుగా గ్రామం లో మృతి చెందిన వారి దహన కార్యక్రమాల కొరకు అప్పుడున్న టిఆర్ఎస్ ప్రభుత్వము ప్రతీ గ్రామానికి వైకుంఠ ధామాలను నిర్మించారని,నవాబుపేట్ గ్రామంలో ఉన్న వైకుంఠ ధామనికి మాత్రం ఎన్నో ఏండ్లుగా దారి లేదు,దారిలేకుండానే కేవలం కమిషన్ల కోసమే వైకుంఠధామాన్ని నిర్మించారని వారు మండిపడ్డారు.ఈ గ్రామస్తులు ఎవరు మరణించిన దహన సంస్కారాలు వాగులోనే నిర్వహిస్తున్నామని,వర్షాకాలంలో వాగులో నీరు ప్రవహించిన పుడు దహన సంస్కారాలు జరిపించడం కొరకు చాల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఈ విషయాన్ని గత కొన్ని ఏండ్లుగా పాలక వర్గం దృష్టికి తీసుకుపోయిన సమస్య మాత్రం అలాగే ఉందని కనీసం నూతన పాలక వర్గం వచ్చినాక అయిన ఈ సమస్య పరిష్కరిస్తారు అనుకుంటే ఇప్పటికీ నాలుగు సమావేశాలు అయిన కూడా ఎలాంటి తీర్మానాలు చేయలేదన్నారు.గ్రామ పంచాయితీలో నిధులు ఉన్నప్పటికీ వైకుంఠ దామనికి రోడ్డు ఏర్పాటు చేయకపోవడం పట్ల గ్రామంలో సర్వత్రా విమర్శలు ఎదురు అవుతున్నాయన్నారు.ఇది ఇలా ఉంటే మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామంలో నీటి సమస్య రాకుండా ఉండటం కొరకు వాగులో ఉన్న నీటి బావి నుండి గ్రామంలోకి నీరు వచ్చేందుకు గాను పైపు లైన్ కొరకు దాదాపు 25లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని,కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం,బిల్లుల కోసం తూ తూ మంత్రంగా పని చేసి వాగు నుండి వేసిన మంచి నీటీ పైపు లైన్ పూడ్చుకుంట సిమెంటు దిమ్మెలు కట్టి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు.వర్షాకాలంలో ఒకవేళ భారీ వర్షాలు వచ్చి వాగు నిండింది అంటే ఆ నీటి పైపులు చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందని,లక్షల రూపాయల నిధులు నీళ్ల పాల్లు అయ్యే ప్రమాదం ఉందని,అందుకే ఇకనైనా నూతన పాలకవర్గం వైకుంఠ ధామనికి రోడ్డు నిర్మించి నీటి వసతులు కలిపించి అలాగే వాగు నుండి ఊర్లో కి వస్తున్న నీటి పైపు లైన్ గుంతను పూడ్చి ఈ సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.లేని పక్షంలో ఈ సమస్యని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జి,మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్,గ్రామ సీనియర్ నాయకులు గుళ్ళ వెంకటేశం పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ కుటుంబ సభ్యులు



**యాదగిరిగుట్ట, మే 27 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా సతీమణి జానకి శుక్లా, కుమార్తె నీతూ శుక్లా. వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధానాలయ ముఖ మండపంలో వేదాశీర్వచనం చేశారు వేదపండితులు. వారికి స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు.

# గంజాయి, రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపండి

**• నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్**



**నల్లగొండ ప్రతినిధి, మే 27 (జనం సాక్షి) :** నల్లగొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిపాలన, శాంతి భద్రతల నిర్వహణ, నేర నియంత్రణ చర్యలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేస్ డైరీలు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్ట్ డిస్పోజల్ రికార్డులు, వారంట్ అమలు స్థితి తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. క్రైమ్ ప్రాపర్టీ రూమ్‌లో భద్రపరిచిన కేసు సంబంధిత వస్తువులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి, వాహనాల నిర్వహణను తనిఖీ చేసి వాటిని శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని సూచించారు. కోర్ట్ రికార్డ్ రూమ్ నిర్వహణను పరిశీలించి కేసు పత్రాలు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వాష్ రూమ్‌లు, మెన్ బ్యారెక్, సిబ్బంది విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి మెరుగైన వాతావరణం కల్పించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది కిట్, యూనిఫామ్, ఆయుధాల నిర్వహణ, డ్యూటీ నిర్వహణ తీరు, హాజరు పుస్తకాలను కూడా పరిశీలించారు.శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ, రాత్రి వేళల్లో బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలపై తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, జూదం, అక్రమ మద్యం, ఈవ్‌టీజింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళా సంబంధిత ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత పెంచి నేర నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించాలని తెలిపారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచాలని, గ్రామాలు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పోలీస్ అధికారులు, స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎస్పీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డ్ లు ప్రకటించారు.ఈ తనిఖీలో జిల్లా ఎస్పి వెంట డిఎస్పీ శివరాం రెడ్డి, 2 టౌన్ సీఐ రాఘవరావు, ఎస్బి సీఐ ఆది రెడ్డి, డిసిఆర్బి సీఐ శ్రీను నాయక్, 2 టౌన్ ఎస్.ఐ సైదులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాలేరు వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నూతనకల్, మే 27 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జరుగుతున్న ప్రతి ఒక్క అభివృద్ధి పని ప్రజలకు తెలియాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు బుధవారం మండల పరిధిలోని యడవల్లి ఆవాస ప్రాంతం గుండ్ల సింగారం వద్దగల పాలేరు వాగుపై 13 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి వారు మాట్లాడారు సూర్యాపేట నూతనకల్ దంతాలపల్లి ప్రధాన రహదారి పై గత 75 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం వచ్చిన సమయంలో నీరు బ్రిడ్జ్ మీదుగా ప్రవహించడంతోపాటు బ్రిడ్జికి గల స్లాబు పెచ్చులు ఊడిపోయి సువ్వలు బయటికి కనిపించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయంతో ప్రయాణం చేయడం గమనించి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు బ్రిడ్జి దుస్థితిని తెలియజేసి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరడంతో వారు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించినట్లు వారు తెలిపారు అనంతరం తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు చురుగ్గా పాల్గొని సహకరించిన తన సహచరుడు తీగల మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న పిఎసిఎస్ చైర్పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,తుంగతుర్తి పిఎసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్,తుంగతుర్తి సేవాదళ్ అధ్యక్షులు పాల్వాయి నాగరాజు, సర్పంచులు జటంగి సరిత కృష్ణ యాదవ్,గుగులోతు కృష్ణ నాయక్,అనంతుల శ్రీనివాస్, జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్, పాండవుల లింగన్న, తహసిల్దార్ పి శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, మండల ప్రధాన కార్యదర్శి బంటు బద్రి,జిల్లా నాయకులు కట్ట మల్లారెడ్డి,దరిపల్లి వీరన్న, మట్టపల్లి గంగయ్య యాదవ్, ఎలిమినేటి కృష్ణ ప్రశాంత్, నకిరేకంటి వెంకన్న,గుణగంటి వెంకన్న,ఇరుగు కిరణ్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బోల్క సైదులు యాదవ్, భయ్యా గంగయ్య యాదవ్,ఈ ఈ,డి ఈ, ఏఈ లు, ఆయా శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి పైలెట్ ప్రాజెక్టు త్వరలోనే అమలు



**గాంధారి, మే 27 (జనంసాక్షి) :** గాంధారి మండలంలోని సీతాయిపల్లి గ్రామంలో నిర్వహించిన "భూ భారతి - భూముల రీ సర్వే అవగాహన సదస్సు" కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో భూములకు సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని, ప్రతిరోజూ ఎంతోమంది ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వస్తున్నారని తెలిపారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో ప్రత్యేకంగా మాట్లాడి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో "భూ భారతి" పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయాలని ఒప్పించినట్లు తెలిపారు.అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశానన్నారు. గాంధారి మండలంలోని చాలా గ్రామాలు అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉండటంతో భూముల విషయంలో తరచూ వివాదాలు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కొన్నిసార్లు అటవీ శాఖ అధికారులు వచ్చి భూములకు హద్దులు వేస్తుంటే, రైతులు ఈ భూమిని మేము 30-40 ఏళ్లుగా సాగు చేస్తున్నాం" అంటూ తన వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం చూపించడానికే "భూ భారతి -- భూముల రీ సర్వే" కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులు తో సమన్వయం చేసుకొని తమ భూములకు రీ సర్వే చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అటవీ శాఖ అధికారులు మరియు రైతుల మధ్య ఉన్న భూముల గందరగోళం శాశ్వతంగా తొలగిపోతుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి



**కామారెడ్డి ప్రతినిధి, మే 27 (జనంసాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి సంబంధిత అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ ద్వారా వెహికల్స్ సంఖ్యను పెంచాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు మరియు జొన్న కొనుగోళ్ల కోసం అవసరమైన వెహికల్స్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఇంకా జొన్న కొనుగోలు ప్రక్రియ పూర్తి కాని కేంద్రాలలో వెంటనే ప్రక్రియ పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న టాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సీఎంఆర్ కొరకు ఏర్పాటు చేసిన వాహనాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రమేష్ దాబాలో బల్లి దర్శనం

**• కుళ్లిన చికెన్, మురిగిన కోడిగుడ్లతో దాబాలో కల్తీ ఆహారం**
**• దాబాలను తనిఖీలు చేయని ఫుడ్ ఇన్స్పెక్టర్..?**

**ఖమ్మం రూరల్, మే 27 (జనం సాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డులో ఉన్న రమేష్ దాబాలో వెలుగుచూసిన కల్తీ ఆహారం ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చికెన్ కర్రీలో బల్లి కనిపించడంతో కస్టమర్లు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

**చికెన్‌లో బల్లి కనిపించడంతో కలకలం**

భోజనం కోసం దాబాకు వచ్చిన కొందరు ఫుడ్ ప్రేమికులు చికెన్ కర్రీ ఆర్డర్ చేశారు.భోజనం చేస్తున్న సమయంలో చికెన్ కర్రీలో బల్లి కనిపించడంతో వారు షాక్‌కు గురయ్యారు. వెంటనే హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, వారు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు కస్టమర్లు ఆరోపించారు.ఈ విషయం బయటకు రావడంతో అక్కడ ఉన్న ఇతర కస్టమర్లు కూడా భయాందోళనకు గురయ్యారు.

**వంటశాలలో అపరిశుభ్ర పరిస్థితులు**

దీంతో సంఘటన జరిగిన తర్వాత జనం సాక్షి విలేఖరి రమేష్ దాబాకు వెళ్లి వంట శాలను పరిశీలించగా కల్తీ ఆహారం, కుళ్ళిన చికెన్, మురిగిన కోడి గుడ్లు దర్శనం ఇచ్చాయి.అక్కడ ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన చికెన్ కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో పాటు, మురిగిపోయిన కోడిగుడ్లను కూడా వంటల్లో ఉపయోగిస్తున్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది.అదేవిధంగా వంటగది మొత్తం చెత్తతో నిండిపోయి ఉండడం, ఎక్కడ చూసినా ఈగలు తిరగడం, దుర్వాసన రావడం గమనార్హం.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం**

నాసిరకం ఆహార పదార్థాలతో వంటలు తయారు చేసి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నారని స్థానికులు మండిపడ్డారు. కోదాడ, మరోవైపు హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉండడంతో,ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు, కార్మికులు, యువత ఈ దాబాలో భోజనం చేస్తుంటారని, ఇలాంటి ఆహారం కారణంగా ఫుడ్ పాయిజనింగ్ వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తరచూ తనిఖీలు నిర్వహించాలి**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లు, దాబాలపై



తరచూ తనిఖీలు నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పరిశుభ్రత పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకోని, కేసులు నమోదు చేస్తాం**

కల్తీ ఆహారం సంఘటన మా దృష్టికి రాగానే రమేష్ దాబాను పరిశీలించడం కోసం వెళ్లడం జరిగిందని, దాబా నిర్వాహకులు దాబాను మూసివేసి పరారీలో ఉన్నట్లు ఫుడ్ ఇన్స్ ఫెక్టర్ లోకేష్ తెలిపారు. మరొకసారి గురువారం దాబాను పరిశీలించి దాబా నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




# మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

## సెన్సెక్స్ 142 పాయింట్లు డౌన్

**ముంబయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టపోయాయి. ఇరాన్- అమెరికా మధ్య శాంతి ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమం లోనే సెన్సెక్స్ 141 పాయింట్ల నష్టంతో 75,867.80 వద్ద ముగియగా.. నిఫ్టీ 6.55 పాయింట్ల నష్టంతో 23,907.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.69గా ఉంది. సెన్సెక్స్ 75,939.86 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,009.70) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,748.21- 76,224.68 మధ్య చలించింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఎటర్నల్,



ఎన్టీపీసీ, టాటా స్టీల్, ఇండిగో షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.25 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,484 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## జనరేటివ్.. ఏజెంటిక్ ఇవీ భేదాలు

ఏఐ, జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ అనే పదాలు తరచుగా వినిపిస్తున్నాయి. వాటి మధ్య తేడా ఏమిటో సరళంగా తెలుసుకుందాం. ఏఐ సజెస్ట్ చేస్తుంది. జన్ ఏఐ కొత్త కంటెంట్ సృష్టిస్తుంది. ఏజెంటిక్ ఏఐ పూర్తి ఎగ్జిక్యూషన్ చేస్తుంది. ఏఐ: జొమాటో యాప్ మీ గత ఆర్డర్లు చూసి.. 'హైదరాబాదీ బిర్యానీ మళ్లీ కావాలా?' అంటూ సజెస్ట్ చేస్తుంది. ఇది డేటా ఆధారంగా అంచనా వేయడం. జనరేటివ్ ఏఐ: మీరు 'హెల్దీ బిర్యానీ కావాలి' అంటే కొత్త ఐడియాలు ఇస్తుంది. ఏజెంటిక్ ఏఐ: 'రాత్రి 8కి బిర్యానీ రావాలి, కూపన్ వాడండి, తక్కువ స్పైసీగా ఉండాలి'. ఇది స్వయంగా రెస్టారెంట్ ఎంచి, ఆర్డర్ చేసి, ట్రాక్ చేసి, డెలివరీ చేస్తుంది. ఎల్‌ఎల్‌ఎం (లార్జ్ లాంగ్వేజ్ మోడల్).. భాష అర్థం చేసుకునే మెదడు లాంటిది. చాట్ జీపీటీ, జెమినీ లాంటివి దీని ఆధారంగా పనిచేస్తాయి. మీరు చెప్పిన 'తక్కువ మసాలా బిర్యానీ' అంటే మైల్డ్ స్పైస్ అని అర్థం చేసుకుంటుంది. ఇక ఎంసీపీ (మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్) వారధి లాంటిది. ఏఐని జొమాటో, జీమెయిల్, మ్యాప్స్, పేమెంట్స్ లాంటి బాహ్య యాప్స్‌కు అనుసంధానిస్తుంది.

ఏ రంగంలో ఎలా?

కృత్రిమ మేధ (ఏఐ) అనేది మల్టీ డిసిప్లినరీ. అన్ని రంగాల్లోకీ ప్రవేశిస్తోంది. ఇది ఏ రంగంలోనైనా ఉపయోగపడుతుంది. ఎంబీఏ/ బిజినెస్: మార్కెట్ అనలిటిక్స్, కస్టమర్ సెగ్మెంటేషన్.

లైఫ్ సైన్సెస్: డ్రగ్ డిస్కవరీ, మెడికల్ ఇమేజింగ్.

కామర్స్: ఫ్రాడ్ డిటెక్షన్, రిస్క్ మోడలింగ్.

ఆర్ట్స్ అండ్ మీడియా: కంటెంట్ క్రియేషన్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్.

అందుకే ఏఐపై అవగాహన తప్పనిసరి. ఏఐ నేర్చుకోవడానికి బేసిక్స్ ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, లీనియర్ ఆల్జీబ్రాల పరిజ్ఞానం సరిపోతుంది. బేసిక్ పైతాన్/ ఎస్‌క్యూఎల్ తప్పనిసరి. లో-కోడ్ టూల్స్ కూడా వాడొచ్చు.

ఏఐని మాస్టర్ చేయడానికి రోడ్ మ్యాప్

ఫౌండేషన్స్: పైతాన్, ఎస్‌క్యూఎల్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, లీనియర్ ఆల్జీబ్రా.

ఏఐ కోర్ స్కిల్స్: మెషిన్ లెర్నింగ్ (రిగ్రెషన్, క్లాసిఫికేషన్, క్లస్టరింగ్), డీప్ లెర్నింగ్.

జనరేటివ్ ఏఐ: ఎల్‌ఎల్‌ఎంలు (చాట్ జీపీటీ, జెమినీ), ప్రాంప్ట్ ఇంజినీరింగ్, హగ్గింగ్‌ఫేస్ లైబ్రరీస్.

ఏజెంటిక్ ఏఐ: లాంగ్‌చెయిన్, లామా ఇండెక్స్, ఎంసీపీ.

ప్రాజెక్టులు: రెజ్యూమె స్క్రీనర్, చాట్‌బాట్, ఏఐ ఫుడ్ రికమండేషన్ యాప్ లాంటి చిన్న ప్రాజెక్టులు.

కనీస లాప్‌టాప్ అవసరాలు

ప్రాసెసర్: ఐ5 (11వ జన్ లేదా రైజన్ 5) లేదా ఎక్కువ.

ర్యామ్: 16 జీబీ (8 జీబీ బేసిక్స్‌కి సరిపోతుంది)

స్టోరేజ్: 512 జీబీ ఎస్‌ఎస్‌డీ

జీపీయూ (ఆప్షనల్): ఎన్‌విడియా జీటీఎక్స్ 1650/ ఆర్‌టీఎక్స్ 3050 (కుడ సపోర్ట్) జీపీయూ లేకున్నా గూగుల్ కొలాబ్, కాగుల్, అజూర్ ఫ్రీ క్రెడిట్స్ వాడవచ్చు. ఏఐ నేర్చుకోవడం ఖరీదేమీ కాదు. ఫ్రీ రిసోర్సెస్, క్లౌడ్ జీపీయూస్ వాడితే ఖర్చు తక్కువవుతుంది.

## రిలయన్స్ ఏజీఎం తేదీ ఖరారు..



**ముంబై:** ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం తేదీ ఖరారైంది. జూన్ 19వ తేదీన ఏజీఎం నిర్వహించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో తెలిపింది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి వీడియో కాన్ఫరెన్స్ రూపంలో ఈ ఏజీఎం నిర్వహించనున్నారు. రిలయన్స్‌కు చెందిన డిజిటల్ వ్యాపారమైన జియో ప్లాట్‌ఫామ్ ఐపీఓ వేళ ఈ ఏజీఎం జరుగుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఐపీఓకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఏజీఎం వేదికగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పాటు రిలయన్స్ భవిష్యత్ పెట్టుబడులు, రిటైల్ వ్యాపార విస్తరణ, న్యూ ఎనర్జీ వ్యాపారానికి సంబంధించిన కొత్త ప్రకటనలు కూడా ఈ వేదికగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన రిలయన్స్ ఇండస్ట్రీస్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు గానూ జూన్ 5ను రికార్డు తేదీగా నిర్ణయించారు. డివిడెండ్ చెల్లింపులకు ఏజీఎంలో ఆమోదం లభిస్తే సమావేశం జరిగిన వారం రోజుల్లో చెల్లింపులు జరుగుతాయి.

## 1 నుంచి పెరగనున్న హ్యుందాయ్ కార్ల ధరలు

ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ హ్యుందాయ్ కార్ల ధరలను పెంచనుంది. వేరియంట్‌ను బట్టి రూ.12,800 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. జూన్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కమొడిటీ, ముడిసరకుల ధరలు పెరగడంతో కార్యకలాపాల వ్యయం భారంగా మారిందని కంపెనీ తెలిపింది. కార్లలో వేరియంట్లు, మోడళ్ల ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుందని పేర్కొంది. వినియోగదారులపై భారం మోపాలనే ఉద్దేశం సంస్థకు లేదని, మార్కెట్ ధరల ప్రభావం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది.




## ఎల్ఐసీలో రూ.10వేల కోట్ల వాటా విక్రయానికి సన్నాహాలు

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీలో మరోసారి వాటా విక్రయానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 2 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వాటా విక్రయం ద్వారా సుమారు రూ.10వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాయి. సంస్థాగత మదుపర్లకు ఈ వాటాలు విక్రయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ జూన్ చివర్లో లేదా జులై ప్రారంభంలో ఉండొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ లావాదేవీని నిర్వహించడానికి గోల్డ్‌మన్ శాక్స్, మోతీలాల్ ఓస్వాల్, బీఎన్‌పీ పరిబాస్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ వంటి ప్రముఖ సంస్థలతో ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఓ విభాగం పనిచేస్తోందని తెలిసింది. 2022 మే నెలలో ఎల్ఐసీ 3.5 శాతం వాటాకు సమానమైన షేర్లను ఐపీఓ ద్వారా విక్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే సుమారు రూ.21 వేల కోట్లు సమీకరించింది. అయితే, సెబీ నిబంధనల ప్రకారం.. లిస్టయిన 10 ఏళ్లలోపు లిస్టెడ్ కంపెనీ తన పబ్లిక్ షేర్‌హోల్డింగ్‌ను కనీసం 25 శాతానికి పెంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఎల్ఐసీలో 96.5 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్‌హోల్డింగ్‌ను పెంచే ప్రయత్నాల్లో భాగంగానే ప్రభుత్వం ఈ తాజా వాటా విక్రయానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## 5 నెలల్లో 68% జంప్..

### ఇన్ఫీని దాటేసిన అదానీ పవర్

**న్యూఢిల్లీ:** గౌతమ్ అదానీకి చెందిన అదానీ పవర్ కీలక మైలురాయిని అందుకుంది. ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌ను అధిగమించి భారత్‌లో 11వ అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కంపెనీ మార్కెట్ విలువ 68 శాతం వృద్ధి సాధించి రూ.4.85 లక్షల కోట్లకు చేరింది. ఈ క్రమంలోనే ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ (రూ.4.72 లక్షల కోట్లు)ను దాటేసింది. బుధవారం ట్రేడింగ్‌లో ఎన్ఎస్ఈలో అదానీ పవర్ షేరు విలువ 3 శాతం పెరిగి రూ.252 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. వారం వ్యవధిలో ఈ షేరు విలువ 13 శాతం మేర లాభపడింది. గడిచిన ఏడాదిలో 126 శాతం మేర షేరు విలువ రాణించింది. గడిచిన మూడేళ్లలో 384 శాతం లాభపడగా.. ఐదేళ్ల వ్యవధిలో 1213 శాతం మేర లాభపడింది. దేశంలో పారిశ్రామిక, గృహ అవసరాలకు అధిక విద్యుత్ డిమాండ్ ఉండటం అదానీ పవర్ షేర్లకు కలిసొచ్చింది. అదేవిధంగా ఏఐ, ఆంత్రోపిక్ కొత్త టెక్నాలజీల రాకతో ఐటీ కంపెనీలు కొన్ని నెలలుగా ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఆయా కంపెనీల షేర్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. దీంతో ఇన్ఫోసిస్ షేరు విలువ గడిచిన వారంలో నుంచి 3 శాతం పడిపోగా.. ఏడాదిలో 26 శాతం మేర పతనమైంది. ఈ క్రమంలోనే ఇన్ఫీని అదానీ పవర్ అధిగమించింది.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# మృతదేహాలను ఎత్తుకెళ్తున్నారు

## కాంగోలో ఆందోళనకరంగా ఎబోలా వ్యాప్తి

### వైరస్ విస్తృతికి తోడు, స్థానికుల సంప్రదాయాల పట్టింపులతో పరిస్థితి మరింత ఆందోళనకరం



**అబుజా:** కాంగోలో... ఎబోలా వైరస్ విస్తృతికి తోడు, స్థానికుల సంప్రదాయాల పట్టింపులు పరిస్థితిని ఆందోళనకరంగా మారుస్తున్నాయి. అబుజాలో ఎబోలా రోగులకు చికిత్స అందిస్తోన్న ఓ ఆసుపత్రిపై ఆదివారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. ఈ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు వ్యక్తుల మృతదేహాలను ఎత్తుకెళ్లారు. వ్యాధి విస్తరణ భయంతో ఎబోలా కారణంగా మృతి చెందిన వారికి అధికారులే అంత్యక్రియలు జరుపుతుండటంపై స్థానికంగా వ్యతిరేకత ఎక్కువవుతోంది. సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు జరగట్లేదంటూ కొందరు బాధ్యతారహితంగా వ్యవహరించి ఎబోలా సోకిన వారి మృతదేహాలను తీసుకెళ్తున్నారు. దీని వల్ల వైరస్ మరింత వేగంగా విస్తరించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తోన్న ఎబోలా కట్టడికి భారత్ సహా పలు దేశాలు ఇప్పటికే చర్యలు చేపట్టినప్పటికీ, ఈ సంక్షోభం పుట్టుకొచ్చిన కాంగోలో మాత్రం వైరస్ నియంత్రణ విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. రెండు నెలల కిందటే ఈ వైరస్ వ్యాప్తి మొదలైనా దాన్ని గుర్తించడంలో వారు ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది. ఈశాన్య కాంగోలోని బునియాలో ఈ నెల 15న ఎబోలా తొలి కేసు నమోదైంది. కానీ, దాదాపు రెండు నెలల ముందే అక్కడ ఈ వైరస్ వ్యాప్తి మొదలైనట్లు అంతర్జాతీయ సంస్థల విచారణలో తేలింది. బునియాలో వైరస్ నిర్ధారణ తర్వాత కూడా కట్టడి చర్యలు తూతూమంత్రంగానే ఉన్నాయని, ఎబోలా లక్షణాలున్న వారిని ఐసోలేషన్‌లో ఉంచడం, వైద్యులు పీపీఈ కిట్లు ధరించడం వంటివి మచ్చుకైనా కన్పించలేదని వెల్లడైంది. దీన్నిబట్టి ఊహించిన దానికంటే తీవ్రస్థాయిలో ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శానిటైజర్లు, టెస్ట్ కిట్లు చాలినంత లేవని, జనరేటర్లకు సరిపడా ఇంధనం లేక రోజుకు 20 నుంచి 40 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. నిధుల కొరత కారణంగా వైరస్ నియంత్రణకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. మొత్తం 904 ఎబోలా అనుమానిత కేసులు నమోదయ్యాయని, వైరస్ కారణంగా 119 మంది మృతి చెందారని కాంగో ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మరోవైపు, ఉగాండాలో వైరస్ బారిన పడిన వారి సంఖ్య 7కు చేరుకొంది.

## సరిహద్దుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

360-డిగ్రీల భద్రతా కవచానికి ఏర్పాటు

ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360-డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్? షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్‌ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్‌షా ఆదేశించారు.

## ఆమెను 487 సార్లు అమ్మేశాడు... ఆ తర్వాత లెక్కపెట్టడం మానేసింది

**పారిస్:** ఫ్రాన్స్‌లో మరో అమానుష ఘటన వెలుగుచూసింది. ఒక బ్యాంక్ మేనేజర్ తన ప్రేయసికి ఏడేళ్లు నరకం చూపించాడు. 487 మందికి ఆమెను అమ్మేసి, వికృతానందం పొందాడు. బాధితురాలు కోర్టు మెట్లు ఎక్కడంతో.. ఆ బ్యాంకర్ కటకటాలపాలయ్యాడు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బ్యాంకర్ గిల్లౌమ్ బూచి 2015 నుంచి 2022 మధ్య ఓ మహిళతో రిలేషన్ కొనసాగించాడు. ఆ సమయంలో ఆమెను కట్టేసి, కొట్టి ఆనందం పొందేవాడు. రానురాను అతడి ప్రవర్తన మరింత క్రూరంగా మారిందని విచారణలో భాగంగా బాధితురాలు వెల్లడించింది. తనను మానసికంగా నియంత్రిస్తూ.. క్రమక్రమంగా వ్యభిచారంలోకి నెట్టేశాడని పేర్కొంది. స్నేహితులు, సహోద్యోగులు, ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులకు తనను విక్రయించాడని తెలిపింది. "వారిలో కొందరిని 10సార్లకు పైగా చూశాను. 487 మంది తర్వాత నేను లెక్కపెట్టడం మానేశాను" అంటూ వాపోయింది. 2017లో ఒక బిడ్డకు జన్మనిచ్చి, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత తనను ఒక ట్రక్ డ్రైవర్‌కు అమ్మినట్లు చెప్పింది. "ఆ సమయంలో నాకు లోలోపలే చనిపోయినట్లు అనిపించింది. ఆ హింస కారణంగా ఇప్పుడు శారీరకంగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాను. నేను అతడిని విడిచిపెట్టి వెళ్లిపోతే.. వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తాడనే భయంతోనే అంతా భరించాను" అని కోర్టుకు వెల్లడించింది న్యాయస్థానానికి సమర్పించిన పలు టెక్ట్స్, వాయిస్ మెసేజ్‌ల్లో ఆమెను అతడు బెదిరించినట్లు తేలింది. తన పైశాచిక ఆనందం కోసమే ఆమెను హింసించిన అతడు.. అదంతా తన ప్రేయసికి ఇష్టమేనంటూ బుకాయించడం గమనార్హం. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. అతడికి 25 ఏళ్ల జైలు విధించింది.

# తిండి పెట్టకుండా కొట్టి.. లైంగికంగా వేధించి

## 100కు పైగా స్కూళ్లలో పసిపిల్లలపై ఘోరం



**పారిస్:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో సభ్యసమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన చోట పసిపిల్లలపై కొందరు మానవమృగాలు అకృత్యాలకు పాల్పడ్డాయి. అభం శుభం తెలియని చిన్నారులకు తిండిపెట్టకుండా హింసించడమే గాక.. వారిని లైంగికంగా వేధించారు. దీంతో పాఠశాలకు వెళ్లాలంటేనే చిన్నారులు భయపడే పరిస్థితి నెలకొంది. దాదాపు 100కు పైగా ప్రాథమిక పాఠశాలల్లో చోటుచేసుకున్న ఈ అమానుష ఘటనలకు సంబంధించిన బ్రిటన్ పత్రిక రాసిన సంచలన కథనంతో ఈ ఘోరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో చర్యలు చేపట్టిన ఫ్రాన్స్ అధికారులు.. ఈ కేసులపై బహిరంగ విచారణ ప్రారంభించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 84 ప్రీస్కూళ్లు, దాదాపు 20 ప్రైమరీ పాఠశాలలు, 10 డేకేర్ సెంటర్లలో ఈ దారుణాలు వెలుగుచూశాయని పారిస్ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ఈ పాఠశాలల్లో గత రెండేళ్లుగా అనేక మంది చిన్నారులపై హింస, లైంగిక వేధింపులు అత్యాచారాలు జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుల్లో చాలామంది 3 నుంచి 5 ఏళ్లలోపు పసిపిల్లలే కావడం అత్యంత బాధాకరం. లంచ్ బ్రేక్, నిద్రపోయే సమయం, ఇతర యాక్టివిటీస్‌లో చిన్నారులను పర్యవేక్షించే విధుల్లో ఉండే స్కూల్ మానిటర్లే ఈ ఘోరాలకు పాల్పడినట్లు తెలిసింది.

**స్కూల్ చూడగానే భయంతో వణికి..**

ఈ స్కూల్ మానిటర్లు తమ పిల్లల జుట్టు లాగి కొట్టేవారని, వారికి తిండి పెట్టకుండా హింసించారని పలువురు తల్లిదండ్రులు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. వీరి అఘాయిత్యాలకు భయపడిన చిన్నారులు స్కూల్ పేరెత్తితేనే వణికిపోయేవారట. పాఠశాల లోపలికి వెళ్లగానే తమ మూడేళ్ల కుమారుడు వణుక్కుంటూ ఏడ్చేవాడని అతడి తల్లిదండ్రులు వాపోయారు. ఎన్నోసార్లు బుజ్జగించిన తర్వాత ఆ పిల్లాడు తనపై జరిగిన వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. మేనేజ్‌మెంట్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వీరే కాదు.. ఆయా స్కూళ్లలో చదువుతున్న చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇదేవిధమైన ఫిర్యాదులు చేశారు. అయితే, తమ ఫిర్యాదులను కొన్ని నెలల పాటు పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు దీనిపై తల్లిదండ్రులు తీవ్రంగా ఆందోళనలు చేపట్టడంతో ఈ ఏడాది ఆరంభం నుంచి విచారణలు ప్రారంభించారు. ఈ కేసులకు సంబంధించి తొలి విచారణ ఓ స్కూల్ అటెండెంట్‌పై జరిగింది. 2024 ఆగస్టు నుంచి 2025 ఏప్రిల్ మధ్య అతడు మూడు నుంచి ఐదేళ్ల వయసున్న ఐదుగురు చిన్నారులను లైంగికంగా వేధించినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గతంలో అదే స్కూల్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులను కూడా నిందితుడు వేధించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో అతడు దోషిగా తేలితే 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. సాధారణంగా ఇలాంటి స్కూళ్లల్లో టీచర్లను నేషనల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ కింద నియమిస్తారు. అయితే, స్కూల్ మానిటర్లు, అడెండర్లను మాత్రం స్థానిక అధికారులు విధుల్లోకి తీసుకుంటారు.

**బహిరంగ విచారణలు..**

ఈ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో పారిస్ మేయర్ ఇమ్మాన్యుయేల్ గ్రెగోయిర్ చర్యలు చేపట్టారు. ఇప్పటికే 78 మంది స్కూల్ మానిటర్లను విధుల నుంచి సస్పెండ్ చేశారు. వీరిలో 31 మందిపై లైంగిక వేధింపుల ఆరోపణలున్నాయి. రానున్న రోజుల్లో విచారణ జరిపి మరింతమందిని తొలగిస్తామని మేయర్ తెలిపారు. మరోవైపు, ఈ కేసులపై పారిస్ కోర్టులో బహిరంగ విచారణ ప్రారంభమైంది. సాధారణంగా ఫ్రాన్స్‌లో చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణను రహస్యంగా జరుపుతారు. కానీ, తల్లిదండ్రుల డిమాండ్ల మేరకు ఈ కేసులను బహిరంగంగా విచారిస్తున్నారు. ఆ మధ్య ఫ్రాన్స్‌కు చెందిన ఓ మహిళకు ఆమె భర్త మత్తుపదార్థాలు ఇచ్చి అనేక మందితో అత్యాచారం చేయించిన ఘటన తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆ కేసులో బాధితురాలు బహిరంగ విచారణ కోరారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకునే ఈ కేసుల్లోనూ పబ్లిక్‌గా విచారణ జరపాలని తల్లిదండ్రులు కోరారు.

## నేడు సిద్ధిరామయ్య రాజీనామా!

సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం.

# ముదిరెడ్డిపల్లిలో రైతుల ఆందోళన

- కొత్త మురుగు కాల్వ నిర్మాణంపై గ్రామస్థుల్లో భయాందోళనలు
- పరిశ్రమల రసాయన వ్యర్థాలతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన
- చెరువులోకి కాలుష్య నీరు వస్తే ప్రాణహానికే ప్రమాదమంటున్న రైతులు
- కాల్వ పనులు నిలిపివేసి అధికారుల తీరుపై మండిపడ్డ గ్రామస్తులు



**రాజాపూర్, మే 26 (జనంసాక్షి) :** ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళలాడిన ముదిరెడ్డిపల్లి గ్రామం ప్రస్తుతం పారిశ్రామిక కాలుష్యంతో అల్లాడిపోతోంది. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి ప్రత్యేక వ్యాపార మండలిలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాల ప్రభావంతో ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితమై, పంటలు దెబ్బతింటుండగా తాజాగా కొత్త మురుగు కాల్వ నిర్మాణం గ్రామస్థుల్లో మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. అధికారులు దీనిని వర్షపు నీటి కాల్వగా చెబుతున్నప్పటికీ, పరిశ్రమలు రసాయన వ్యర్థాలను వాననీటితో పాటు నేరుగా గ్రామ చెరువులోకి విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

దాదాపు 17 ఏళ్ల క్రితం ప్రభుత్వం వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేసిన పోలేపల్లి ప్రత్యేక వ్యాపార మండలిలో ప్రస్తుతం సుమారు 170 పరిశ్రమలు కొనసాగుతున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమలు స్థానిక రైతులకు మాత్రం శాపంగా మారాయని గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా ఔషధ తయారీ కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన కాలుష్యంతో భూగర్భ జలాలు విషతుల్యమై, పంటలు సరిగా పండడం లేదని రైతులు చెబుతున్నారు. వరి, మొక్కజొన్న పంటలు ఎర్రబడిపోతుండటంతో పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే కాలుష్య సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులను కొత్తగా నిర్మిస్తున్న మురుగు కాల్వ మరింత భయాందోళనలకు గురిచేస్తోంది. వర్షాకాలంలో పరిశ్రమలు నిల్వ ఉంచిన రసాయన వ్యర్థాలను ఈ కాల్వ ద్వారా చెరువులోకి విడుదల చేసే ప్రమాదం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఆ నీరు చెరువులోకి వస్తే చేపలు చనిపోవడంతో పాటు పశు వులు కూడా మృత్యువాత పడతాయని, చివరకు గ్రామ ప్రజల ఆరోగ్యానికే ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రసాయన కాలుష్యంపై గ్రామస్థులు గతంలో జాతీయ హరిత తీర్పుల మండలిని ఆశ్రయించగా, 2021లో పలు కంపెనీలకు జరిమానాలు విధిస్తూ కాలుష్య నియంత్రణకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిపాలనాధికారి, ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పలుమార్లు తనిఖీలు చేసినా కేవలం తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శిస్తున్నారు. మంగళవారం ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు పోలేపల్లి సెజ్‌లో కొనసాగుతున్న కాల్వ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అరబిందో, హెటిరో, శిల్పా మెడికేర్, మైలాన్, కార్తికేయ వంటి పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నీటిని ఈ కాల్వలోకి మళ్లించే ప్రమాదం ఉందని పేర్కొంటూ కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ముందుగా ఎఫ్‌టీఎల్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసిన తర్వాతే కాల్వ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రాణాలు పోయాక పరిశ్రమలు ఉండి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించిన గ్రామస్థులు, తమ గ్రామాన్ని రసాయన కాలుష్యం నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామస్థులు శేఖర్ గౌడ్, మల్లేష్, కేశవులు, వెంకటయ్య, నారాయణ గౌడ్, వెంకయ్య గౌడ్, శ్రీనివాస్, నర్సింలు ఫార్మా కంపెనీలను ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

# మహిళ దారుణ హత్య

## గొంతు కోసి వెండి కాళ్ల పట్టీలు దోపిడీ

చేవెళ్ల, మే 27 (జనంసాక్షి) చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈర్లపల్లి గ్రామ శివారులో దారుణ ఘటన చోటుచేసుకుంది. చేవెళ్ల-శంకర్‌పల్లి రోడ్డుకు సమీపంలోని సర్వే నంబర్ 47 ప్రభుత్వ భూమిలో ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఎరుకలి మైసమ్మ (48) భర్త గోపాల్ మృతి చెందగా, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మైసమ్మ బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం మధ్యాహ్నం ఈర్లపల్లి శివారులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. దుండగులు మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు కోసి హత్య చేయడంతో పాటు, రెండు కాళ్లను మడమల వరకు కోసి సుమారు 50 తులాల వెండి కాళ్ల పట్టీలు అపహరించినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. మృతురాలి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలాన్ని చేవెళ్ల ఏసీపీ బి.కిషన్, డీసీపీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ పరిశీలించారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తూ నిందితులను పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కమిషనర్ తరుణ్ జోషి ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# అమ్మపల్లి ఆలయంలో హుండీ చోరీ

**శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**శంషాబాద్, మే27(జనం సాక్షి) :** మండలం నర్కూడ గ్రామ పరిధిలోని అమ్మపల్లి ఆలయంలో హుండీ చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు చెగొమ్మ సత్యనారాయణ మూర్తి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం మే 26 రాత్రి ఆలయ పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయానికి తాళాలు వేసి అర్చకుడు ఇంటికి వెళ్లారు. మే 27 ఉదయం ఆలయానికి వచ్చి చూడగా ప్రధాన ద్వారాల తాళాలు పగులగొట్టబడినట్లు గుర్తించారు. ఆలయంలో ఉన్న చిన్న హుండీ కనిపించకపోవడంతో బయట వెతికితే మండపం సమీపంలో హుండీ పగిలిన స్థితిలో ఖాళీగా కనిపించింది. హుండీలో సుమారు రూ.5 వేల నగదు ఉన్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని అపహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# ఎబోలా నోడల్ కేంద్రంగా గాంధీ ఆసుపత్రి

## 10 బెడ్లతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

**సికింద్రాబాద్(జనంసాక్షి): :** ఎబోలా వైరస్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి సిద్ధం అయింది. గాంధీ ఆసుపత్రిని ఎబోలా నోడల్ కేంద్రంగా మారుస్తూ, మెయిన్ బిల్డింగ్ మూడవ అంతస్తులో 10 పడకలతో కూడిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎబోలా వైరస్ లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తులను వెంటనే ఈ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చేర్చుకుని, వారికి అత్యంత ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలు అందిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రత్యేక విభాగానికి నోడల్ ఆఫీసర్‌గా జనరల్ మెడిసిన్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సునీల్ కుమార్‌ను నియమించినట్లు సూపరింటెండెంట్ వివరించారు. ఎబోలా అనుమానిత కేసులపై నిరంతరం నిఘా ఉంచుతామని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

# అడ్డదిడ్డంగా పార్కింగ్... అంబులెన్స్‌లోనే రోగి మృతి

- బోయిన్‌పల్లి మార్కెట్ రోడ్డుపై భారీ ట్రాఫిక్ జామ్
- సైరన్ మోగినా కదలని వాహనాలు
- గంటసేపు నిలిచిపోయిన అంబులెన్స్‌లో వృద్ధుడు కన్నుమూత
- రాస్తారోకోకు దిగిన కుటుంబ సభ్యులు, స్థానికులు

**సికింద్రాబాద్, జనంసాక్షి :** రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేయడం ఓ వ్యక్తి ప్రాణాన్ని బలిగొంది. బోయిన్‌పల్లి మార్కెట్ ప్రధాన రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో అత్యవసర వైద్యం అందక ఓ వృద్ధుడు అంబులెన్స్‌లోనే మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్‌కు చెందిన పోచయ్య అనే వృద్ధుడు మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండె సంబంధిత సమస్యతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అంబులెన్స్ బోయిన్‌పల్లి మార్కెట్ ప్రధాన రహదారిపైకి రాగానే ఇరువైపులా వాహనాలు అస్తవ్యస్తంగా పార్క్ చేయడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అత్యవసర సైరన్ మోగిస్తున్నా ముందుకు వెళ్లేందుకు దారి లేక అంబులెన్స్ దాదాపు గంటసేపు అక్కడే నిలిచిపోయింది. సమయం గడుస్తున్న కొద్దీ పోచయ్య పరిస్థితి విషమించడంతో చివరకు ఆసుపత్రికి చేరుకునేలోపే ఆయన అంబులెన్స్‌లోనే గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. రహదారిపై వాహనాల క్రమబద్ధీకరణ లేకపోవడం వల్లే తమ కళ్లముందే ప్రాణం పోయిందంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు రాత్రి బోయిన్‌పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో అత్యవసర వాహనాలకు సైతం దారి లేకుండా వాహనాలు నిలిపివేయడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తిరుపతి రాజ్ ఆందోళనకారులతో మాట్లాడి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆందోళనకారులను సముదాయించారు.

# భారీగా హవాలా డబ్బును పట్టుకున్న రైల్వే పోలీసులు

- ముంబై నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్న రూ.1.22 కోట్ల హవాలా నగదు స్వాధీనం



**సికింద్రాబాద్(జనంసాక్షి):** సికింద్రాబాద్ ప్రభుత్వ రైల్వే జీఆర్పీ పోలీసులు, రైల్వే రక్షణ దళం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీ హవాలా నగదు పట్టుబడింది. ముంబై నుంచి హైదరాబాద్‌కు దేవగిరి ఎక్స్‌ప్రెస్ ద్వారా తరలిస్తున్న రూ. 1,22,70,000 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైల్వే డీఎస్పీ జావేద్ బుధవారం సికింద్రాబాద్ లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న బొల్లారం-మల్కాజిగిరి రైల్వే స్టేషన్ల మధ్య మధ్యాహ్నం 3గంటల సమయంలో సంయుక్త తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా లగేజీ బ్యాగ్ తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను మహారాష్ట్ర, అమరావతి జిల్లాకు చెందిన విజయ్ అంబాదాస్ గుప్తా (40)గా గుర్తించారు. పోలీసుల విచారణలో, ముంబైలో కాంతా జువెలరీ షాపు నిర్వహిస్తున్న సంతోష్ సేఠ్ నుంచి రూ.1.22 కోట్ల నగదును తీసుకుని, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో జువెలరీ వ్యాపారం చేస్తున్న బంటి అనే వ్యక్తికి ఈ హవాలా నగదును అప్పగించేందుకు తీసుకువస్తున్నట్లు వెల్లడించాడు. ఈ నగదు తరలింపుకు తనకు రూ.5 వేల పారితోషికం ఇస్తామని చెప్పినట్లు తెలిపాడు.అయితే నగదు ఎక్కడ నుంచి తెచ్చారు..? యజమాని ఎవరు..? దీనికి ఈ నగదును వినియో గిస్తున్నారు? అనే సమాచారం లేదు. దానికి సంబంధించి వినియోగంపై ఎలాంటి సరైన పత్రాలు చూపించలేకపోవడం తో, హవాలా లావాదేవీలకు సంబంధించినదిగా భావించి అధికారులు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి మొబైల్ ఫోన్, గుర్తింపు కార్డులు, ప్రయాణ టికెట్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఆపరేషన్‌ను నిర్వహించిన సికింద్రాబాద్ రైల్వే ఇన్స్పెక్టర్ బి.సాయిశ్వర్ గౌడ్, ఎస్ఐఆర్‌పీ టి.మాధవ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు డి.వి.నరసింహారావు, సంజీవ్ రావు ఉన్నారు. ఈ బృందాన్ని ఐజీపీ రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ కె.రమేష్ నాయుడు అభినందిస్తూ, సంబంధిత సిబ్బందికి బహుమతులు ప్రకటించారు.

# రైతులపై అన్యాయం తక్షణమే ఆపాలి

- క్వింటాకు రూ.50 వసూళ్లపై ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆగ్రహం
- బస్తాకు 4 కిలోల కోత విధిస్తున్నారని ఆరోపణ
- 50 రోజులుగా కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- వెంటనే ధాన్యం తరలించి చెల్లింపులు చేయాలని డిమాండ్

**మేడ్చల్, మే 27 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ ఏదులాబాద్ డివిజన్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులపై జరుగుతున్న అన్యాయాలను తక్షణమే ఆపాలని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, అక్కడ నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన సుదర్శన్ రెడ్డి, కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వర్షాకాలం కారణంగా ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతుండటం చాలా దురదృష్టకరమని, ఇప్పటికీ ధాన్యాన్ని తరలించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

రైతుల నుంచి క్వింటాకు రూ.50 వరకు అన్యాయంగా వసూలు చేయడం తీవ్రంగా ఖండనీయమని ఆయన మండిపడ్డారు. 40 కిలోల బస్తాకు కొనుగోలు కేంద్రంలో 2 కిలోలు, రైస్ మిల్లు వద్ద మరో 2 కిలోలు కోత విధించడం రైతుకు భారీ నష్టం కలిగించే దుర్మార్గపు చర్య అని ఆరోపించారు. ఇలాంటి అక్రమ కోతలు రైతుల జీవనాధారంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు 50 రోజులుగా వరి కోసి ధాన్యాన్ని కల్లాల వద్ద పోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, పరిస్థితులు దారుణంగా మారడంతో కొంతమంది రైతులు దళారులకు రూ.1500కే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరగకపోవడం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత తీసుకురావాలని కోరారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని వెంటనే తరలించి చెల్లింపులు వేగంగా చేయాలని అధికారులను హెచ్చరించారు. రైతు సంక్షేమం మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కప్పర్గల కరుణాకర్, మాజీ సర్పంచ్ బట్టే శంకర్, సొసైటీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ధర్మారెడ్డి, బీజేపీ ఘట్‌కేసర్ మండల్ మాజీ ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం, సంకు మల్లేష్, గట్టుపల్లి మల్లేష్ ముదిరాజ్, పూస వెంకటేష్, ఎర్రోళ్ల మురళి, తోటకూరి శ్రీను, బద్దం నాగరాజు, గట్టుపల్లి అనిల్, మహేష్, సాల్వేర్ పాండు, గట్టుపల్లి రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

- బీసీల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌ను రూ.2 లక్షల కోట్లకు పెంచాలన్న ఆర్. కృష్ణయ్య
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌తో బీసీ సంక్షేమ సంఘం నేతల భేటీ
- విద్య, ఉద్యోగాలు, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లపై విస్తృత చర్చ
- డిమాండ్లను కేంద్రానికి సిఫార్సు చేస్తామని సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ



**ముషీరాబాద్, మే 27 (జనంసాక్షి) :** కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీల సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతితో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో పెరికే సురేష్, ఆశిష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 77 సంవత్సరాలు గడిచినా 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇతర సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వశాఖలు ఉన్నప్పటికీ బీసీలకు మాత్రం అలాంటి వ్యవస్థ లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ వాటికి అనుబంధంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, నవోదయ విద్యాసంస్థలకు తగిన బడ్జెట్ కేటాయించడం లేదని విమర్శించారు. ఐఐటీ, ఐఐఎం, నీట్ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో ఫీజులు లక్షల రూపాయల వరకు ఉండటంతో బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్రిమిలేయర్ పరిమితుల కారణంగా పేద విద్యార్థులు సీట్లు వచ్చినా ఫీజులు చెల్లించలేక చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ వేలాది హాస్టళ్లు, గురుకుల పాఠశాలల ద్వారా లక్షలాది విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నాయని, అదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు.

విద్య ద్వారానే సమాజంలో జ్ఞానం, నైతిక విలువలు, సామాజిక సమానత్వం పెరుగుతాయని, దేశాభివృద్ధికి విద్యే ప్రధాన బలం అని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. పరిశ్రమలు, యాంత్రీకరణ పెరగడంతో సంప్రదాయ కులవృత్తులు దెబ్బతిన్నాయని, చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పీహెచ్‌డీ విద్యార్థులకు రాజీవ్ ఫెలోషిప్ స్టైఫండ్‌లు, గురుకుల పాఠశాలలు, హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పారిశ్రామిక విధానాలు, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీసీ సంక్షేమ పథకాలకు కేంద్రం 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవేనని, వాటిని పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విధానాలను దేశవ్యాప్తంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నట్లు వెల్లడించారు.



# రమాబాయి అంబేద్కర్ త్యాగాలు చిరస్మరణీయం

**అల్వాల్, మే 27(జనంసాక్షి):** బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సతీమణి, మాత రమాబాయి అంబేద్కర్ 91వ వర్ధంతి వేడుకలను అల్వాల్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు స్థానిక భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బాబా సాహెబ్ అంబేద్కర్ ఉన్నత శిఖరాలను అధిరోహించడం వెనుక రమాబాయి అంబేద్కర్ చేసిన త్యాగాలు, సేవలు ఎనలేనివని కొనియాడారు. జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం శ్రమించారని గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ గారి ఆశయ సాధనలో ఆమె పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సర్కిల్ అధ్యక్షుడు కార్తీక్ గౌడ్, సీనియర్ నాయకులు రామ్మోహన్ గౌడ్, అజయ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ వర్మ, అజిత్ సాయి, ఉదయ ప్రకాష్, లక్ష్మణ్ ముదిరాజ్, అనిల్ యాదవ్, చరణ్, ప్రదీప్, ఆనంద్, వంశీకృష్ణ, సచిన్, వేణు, రాజు, పద్మిని, సుజాత, స్రవంతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి రైతన్నలు ఆగమాగం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 27 (జనంసాక్షి) :** అకాల వర్షం రైతన్నలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం జిల్లాలో పలు మండలాల్లో రైతన్నలు ఆందోళనకు గురయ్యారు.వేములవాడ నియోజకవర్గాల పరిధిలో రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది.కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఈదురు గాలులకు ఎగిరిపోవడంతో ధాన్యపు రాశులు పూర్తిగా వర్షానికి తడిసిపోయాయి. బస్తాల్లోకి నీరు చేరడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఆగిన వెంటనే ధాన్యపు రాశులపై నిలిచిన నీటిని రైతులు తొలగించే ప్రయత్నం చేశారు. కొనుగోలు కేంద్రాలలో దాన్యం తరలింపు ప్రక్రియ సజావుగా సాగకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం,కొనుగోళ్లలో జాప్యం కారణంగానే తమ ధాన్యం వర్షానికి తడిసిపోయిందని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పెట్టుబడులతో నష్టాల్లో ఉన్నామని,ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.యాసంగి వడ్ల కొనుగోళ్లలో ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటూ ప్రభుత్వంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని గోదంలోకి తరలించాలని రైతులు వేడుకున్నారు.

# ప్రశ్నించే గొంతుకలపై రాజకీయ దాడులు

- పినరయి విజయన్ ఇంట్లో ఈడీ సోదాలపై సీపీఐ(ఎం) ఆగ్రహం
- కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందన్న ఆరోపణ
- ప్రజలను సమీకరించి రాజకీయ, న్యాయ పోరాటాలు చేస్తామన్న నేతలు
- మోడీ ప్రభుత్వ విధానాలపై సీపీఐ(ఎం) తీవ్ర విమర్శలు




**ముషీరాబాద్, మే 27 (జనంసాక్షి) :** కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించడం బీజేపీ చేయిస్తున్న రాజకీయ దాడేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ విమర్శించారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రశ్నించే వ్యక్తులనే లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయరాఘవన్ మాట్లాడారు. సమావేశానికి సీపీఐ(ఎం) నేతలు బీవీ రాఘవులు, జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయరాఘవన్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) నేతలపై ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఒక్క కేసు కూడా లేదని స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) విలువలతో కూడిన నీతివంతమైన పార్టీ అని, ఇతర పార్టీల మాదిరిగా కార్పొరేట్ సంస్థల నుంచి ఎన్నికల బాండ్లు సేకరించలేదని పేర్కొన్నారు.

కేరళలోని కాంగ్రెస్ నేతలపై ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కేసులు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం సీపీఐ(ఎం) నాయకులను టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. ఈడీ దాడులను నిరసిస్తూ వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని తెలిపారు. ప్రజలను సమీకరించి రాజకీయ, న్యాయపరమైన పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని విజయరాఘవన్ విమర్శించారు. రూపాయి విలువ పడిపోవడం, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోందన్నారు. ఆయిల్ కంపెనీలు మాత్రం భారీ లాభాలు గడిస్తున్నాయని ఆరోపించారు. ఇరాన్-ఇజ్రాయిల్ ఉద్రిక్తతల సమయంలో దేశానికి తగిన ఆయిల్ నిల్వలు సిద్ధం చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. కనీస వేతనాలు అమలు కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రూ.10 వేల నుంచి రూ.12 వేల జీతాలతో ప్రజలు ఎలా జీవించాలంటూ ప్రశ్నించారు.నరేగా చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని, ఉపాధి హామీ కూలీల పేర్లు తొలగిస్తూ కేంద్రం రాష్ట్రాలపై భారాలు మోపుతోందని విమర్శించారు. సీపీఐ(ఎం)ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ చేస్తున్న రాజకీయ దాడులను తిప్పికొడతామని, పేదల పక్షాన ముందుండి పోరాడతామని ప్రకటించారు.

బీవీ రాఘవులు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రతిపక్షాలపై కేంద్ర ప్రభుత్వం దాడులను మరింత తీవ్రం చేసిందని ఆరోపించారు. తమిళనాడులో గవర్నర్ వ్యవస్థను అడ్డంపెట్టుకుని ప్రభుత్వం పనితీరును అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై నేరుగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక, లౌకిక శక్తులను ఏకం చేసి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
28 మే 2026

# మహిళా సాధికారతకు మరో ముందడుగు

- పాలకుర్తిలో మహిళా వీఓ భవన నిర్మాణానికి భూమి పూజ
- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రైతులకు రాయితీపై పచ్చి రొట్టె విత్తనాల పంపిణీ : ఎమ్మెల్యే
- పంట అవశేషాలు కాల్చొద్దని రైతులకు సూచన



**గోదావరిఖని, జనంసాక్షి :**
పాలకుర్తి మండలంలోని పాలకుర్తి గ్రామంలో మహిళా వీఓ భవన నిర్మాణ పనులకు బుధవారం రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ మహిళలను మరింత బలోపేతం చేసి వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షుడు, సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
అనంతరం పాలకుర్తి మండలంలో నిర్వహించిన రైతులకు రాయితీపై పచ్చి రొట్టె విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొని రైతులకు విత్తన సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆదాయం పెరగడం, భూమి సారవంతం కావడం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పలు రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. "పొగ లేని పొలం... రోగం లేని గ్రామం" నినాదంతో రైతులు పంట అవశేషాలు, గడ్డి, కొయ్యలను కాల్చకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గడ్డి తగలబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు నేల సారం తగ్గే ప్రమాదం ఉందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వానాకాలం ముందు రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగ, జనుము విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇవి భూమి సారాన్ని పెంచి పంట దిగుబడులకు దోహదపడతాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రైతులకు రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ, రాయితీపై విత్తనాల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొయ్యలకు నిప్పు పెట్టవద్దని, పర్యావరణాన్ని కాపాడుతూ వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఏఎంసీ చైర్మన్, కన్నాల సింగిల్ విండో చైర్మన్, వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, ఎస్‌హెచ్‌ఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నకొండ-మల్యాల డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన

- రూ.50 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ చేపట్టిన ప్రభుత్వం
- కొండగట్టు ప్రయాణం మరింత సులభం కానుందన్న బండి సంజయ్
- చొప్పదండిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్న ఎమ్మెల్యే సత్యం



**చొప్పదండి, మే 27 (జనంసాక్షి) :**
పార్టీలకతీతంగా కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి మల్యాల వరకు రూ.50 కోట్ల నిధులతో చేపడుతున్న డబుల్ రోడ్డు విస్తరణ పనులకు బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల అభివృద్ధి కోసం కలిసి పనిచేయడం వల్లే చొప్పదండి నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అందులో భాగంగానే ఆర్నకొండ-మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంకు వెళ్లే భక్తులు, ప్రయాణికులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యా శాఖలో అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి

**జగిత్యాల బ్యూరో మే 27 (జనం సాక్షి) :**
జిల్లాలో విద్యాశాఖలో 2026-27 విద్యా సంవత్సరంలో ఎలాంటి అక్రమ డిప్యూషన్లకు, అవకతవకలకు తావు లేకుండా చూడాలని జిల్లా విద్యాధికారిని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుక్కోవల శ్యాంసుందర్ అంబటి భూమేశ్వర్లు కోరారు.
నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అక్రమ డిప్యూటేషన్లను ప్రోత్సహించవద్దని, ఇదివరకు ఏమైనా అక్రమంగా కొనసాగినట్లయితే వాటిని వెంటనే రద్దు చేయాలని , ఇకముందు కూడా అక్రమ దిపుటేషన్లను ప్రోత్సహించ కూడదని జిల్లా విద్యాధికారి నీ కోరడం జరిగింది.

# సింగరేణి పెన్షనర్ల సమస్యలపై యాజమాన్యం సానుకూలం

### సిపిఆర్ఎంఎస్ లేని రిటైర్డ్ కార్మికులకు ఉచిత వైద్యం కోరిన బీఎంఎస్

- పెన్షనర్ల కోసం ప్రత్యేక వైద్య వ్యవస్థ ఏర్పాటు దిశగా హామీ
- మూడు నెలల మందులు ఒకేసారి ఇవ్వాలని ప్రతిపాదన
- వైద్య పరిమితి రూ.15 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎంఎస్ అనుబంధం) నాయకులు తెలిపారు. బుధవారం సింగరేణి భవన్‌లో సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రును అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పెన్షనర్లకు సంబంధించిన పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద రమాకాంత్, అడ్వైజర్ పులి రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సింగరేణి మాజీ కార్మికులు ఎదుర్కొంటున్న వైద్య, ఆర్థిక ఇబ్బందులను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సిపిఆర్ఎంఎస్ కార్డు లేని రిటైర్డ్ కార్మికులకు కూడా సింగరేణి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని కోరగా, దీనిపై డైరెక్టర్ గౌతమ్ పొట్రు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. అలాగే పెన్షనర్ల కోసం ప్రత్యేక వైద్య వ్యవస్థ ఏర్పాటు చేయడంపై కూడా అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. పెన్షనర్లకు మూడు నెలలకు సరిపడా మందులను ఒకేసారి అందించడంతో పాటు, మెడికల్ బిల్లులను 45 రోజులలోపు రీయింబర్స్ చేయాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు నివసించే ప్రాంతాలకు సమీపంలోని మెడికల్ షాపుల ద్వారా మందులు అందించే విధానాన్ని అమలు చేయాలని కూడా కోరారు. అదేవిధంగా ప్రతి సభ్యునికి సంవత్సరానికి రూ.25 వేల వరకు వైద్య ఖర్చులు మంజూరు చేయాలని, ప్రస్తుతం రూ.8 లక్షలుగా ఉన్న సిపిఆర్ఎంఎస్ వైద్య పరిమితిని రూ.15 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వైద్యం పొందిన ప్రతిసారి సంబంధిత సభ్యులకు పీఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపే విధానాన్ని అమలు చేయాలని ప్రతినిధులు సూచించారు. ఈ సమస్యలన్నింటిపైనా డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు సానుకూలంగా స్పందించి, దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

### యూరియా కొరతను నిరసిస్తూ సహకార సంఘం

# కార్యాలయానికి తాళం వేసిన రైతులు

### వ్యవసాయ శాఖ అధికారుల నిలదీత



**బోధన్, మే 27 (జనంసాక్షి) :** ప్రభుత్వం సూచించిన యాప్ ద్వారా యూరియా తమ సహకార సంఘానికి మంజూరైనప్పటికీ వచ్చిన ఐదు నిమిషాల్లోనే యూరియా నో స్టాక్ కనిపించడంతో ఆగ్రహించిన రైతులు సహకార సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలపడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారిని శ్వేత ను నిలదీశారు. నిజామాబాద్ జిల్లా సాలూరు మండలం జాడి జమాల్పూర్ సహకార సంఘం పరిధిలో బుధవారం యూరియా బుకింగ్ ను ప్రారంభించారు. అయితే ప్రారంభించిన ఐదు నిమిషాలలోనే స్టాక్ మొత్తం అయిపోవడంతో ఆగ్రహించిన రైతులు మిగతా రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఒక్కసారిగా రైతులందరూ చేరుకొని సహకార సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సాలూరు మండల వ్యవసాయ శాఖ అధికారిని శ్వేత, రెంజల్ మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకోగా అధికారులు తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా నమోదు విషయంలో తగినంత ప్రభుత్వానికి సూచించకపోవడంతోనే యూరియా కొరత ఏర్పడుతుందని ఈ విషయంలో సాలూర మండల వ్యవసాయ శాఖ అధికారిని పూర్తిగా విఫలమైందని రైతులు ఆరోపించారు. స్టాకు పెంచాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో రైతులకు యూరియా కొరత ఏర్పడుతుందని ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి యూరియా పంపిణీని అధికంగా చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

# సభ్యత్వ నమోదుతోనే ప్రత్యర్థి పార్టీలకు ధీటైన సమాధానం

- బూత్ కమిటీ సభ్యులే బీఆర్ఎస్‌కు బలమన్న జీవన్ రెడ్డి
- మళ్లీ కేసీఆర్ నాయకత్వానికే ప్రజల మద్దతు

**ఆర్మూర్, మే 27 (జనంసాక్షి) :**
బీఆర్ఎస్ పార్టీకి బూత్ కమిటీ సభ్యులే కీలకమని, పెద్దఎత్తున పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టి ఇతర పార్టీలకు ధీటైన సమాధానం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్సీ, సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జి వి. గంగాధర్ గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంతరావు షిండే, బీగాల గణేష్ గుప్తా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని, రైతులు, సామాన్య ప్రజలు మళ్లీ కే. చంద్రశేఖర్ రావు ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ లాంటి నాయకుడే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లారీలు రాక కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉండిపోతోందని ఆరోపించారు. తరుగు పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని, రైతుల సొమ్మును మిల్లర్లు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తోడుదొంగలని ప్రజలకు అర్థమైందన్నారు. ప్రజలందరూ కేసీఆర్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.
ఇదే సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్మూర్ గడ్డ నుంచే జీవన్ రెడ్డికి తొలి ఎమ్మెల్యే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అప్పుడే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతోనే నాయకుడి గెలుపు ప్రారంభమవుతుందని, ప్రజలతో మమేకమై పనిచేసే జీవన్ రెడ్డికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ అభివృద్ధి ఏదైనా ఆర్మూర్ నుంచే ప్రారంభమయ్యేదని, జీవన్ రెడ్డి విలువ ఆయన ఓడిన తర్వాత ప్రజలకు మరింత తెలిసిందని అన్నారు.

## అబ్దుల్లాపూర్మెట్ మండలంలో విషాదం

### కుటుంబ పెద్ద మరణాన్ని తట్టుకోలేక తల్లి, కుమారుడు ఆత్మహత్య




**అబ్దుల్లాపూర్మెట్, మే 27 (జనం సాక్షి):**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం లస్కర్‌గూడ కనకదుర్గనగర్ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ పెద్ద మరణాన్ని తట్టుకోలేక తల్లి, కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం పూసల కళాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య కళావతి (45), కుమారుడు శివకుమార్ (20) మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాను

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఎన్‌టీపీసీలోని మిలీనియం హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడని అన్నారు.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం నుంచి ఎన్నికల సమయంలో కష్టనష్టాలను లెక్కచేయకుండా పని చేసే ప్రతి కార్యకర్తే పార్టీకి నిజమైన బలం అని కొనియాడారు. తన విజయంలో కార్యకర్తల శ్రమ, అంకితభావం ఎంతో ఉందని, వారి సేవలను ఎప్పటికీ మరువనని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, వారికి ఏ సమస్య వచ్చినా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం, గౌరవం తనకు ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పని చేసి ప్రజల విశ్వాసాన్ని మరింతగా గెలుచుకోవాలని సూచించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, గ్రామాలు మరియు పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రామగుండం ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, పీక అరుణ్, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మక్క రైతుపై 'అకాల' వర్షాఘాతం

### ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దం




- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దవుతున్న మక్కలు
- అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు భారీ నష్టం
- పద్మాజివాడి సొసైటీ ఎదుట రైతుల ఆందోళన
- తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్

**సదాశివనగర్ (జనంసాక్షి)**
రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట కళ్ల ముందే కురుస్తున్న వర్షానికి కొట్టుకుపోతుంటే, ఆదుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లోనే వేలాది క్వింటాళ్ల మక్కలు (మొక్కజొన్న) తడిసి ముద్దవుతుండటంతో మక్క రైతు ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. అధికారులు, ప్రభుత్వ ఉదాసీనత వల్లే తమకు ఈ దుస్థితి దాపురించిందని అన్నదాతలు రోడ్డుపైకి వచ్చి మండిపడుతున్నారు.
మక్కలు కోసి వారాలు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రాలకు తెచ్చి పగలు, రాత్రి కాపలా కాస్తున్నా కొనుగోళ్లలో అడుగడుగునా జాప్యం జరుగుతోంది. "ఈరోజు కొంటాం.. రేపు కొంటాం" అంటూ అధికారులు కాలయాపన చేయడంతో, ఈ లోపే ఆకాశానికి చిల్లు పడి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాత్రంతా నిద్ర లేకుండా తాడిపత్రిలు కప్పుకుంటూ బతుకుతున్నాం అయినా లాభం లేదు ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేసి, మిల్లులకు తరలించి ఉంటే మాకు ఈ కష్టం వచ్చేది కాదని వాపోయారు.

**ప్రభుత్వాని పట్టింపేది?**
రైతు రాజ్యం అని చెప్పుకునే ప్రభుత్వానికి రైతుల కష్టాలు కంటికి కనిపించడం లేదా అని విపక్షాలు, రైతు సంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. ముందస్తు ప్రణాళిక లేకుండా కొనుగోలు కేంద్రాలు తెరవడం, గూనలు సరఫరా చేయకపోవడం, రవాణా వ్యవస్థను సకాలంలో సిద్ధం చేయకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడుతున్నారు. ఎలాంటి షరతులు లేకుండా, తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన మక్కలను తక్షణమే లారీల ద్వారా మిల్లులకు తరలించాలి. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి, కొనుగోలు కేంద్రాల్లో మక్క రైతుల కష్టాలను చూడాలని, యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు జరపకపోతే రాబోయే రోజుల్లో రైతన్నాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఆచరించేది గులాబీ దళం

### చట్టబద్ధ పోరాటాలే మా లక్ష్యం

- బాల్క సుమన్‌పై అక్రమ కేసు నమోదు దుర్మార్గం
- టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి




**గోదావరిఖని, జనంసాక్షి :**
రాష్ట్ర ప్రభుత్వ సింగరేణి కార్మిక, రైతు వ్యతిరేక చర్యలను ప్రశ్నించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పై అక్రమ కేసు నమోదు చేయడాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్యలు బుధవారం గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో తీవ్రంగా ఖండించారు.
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తొలి మలిదశ పోరాటాలలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేసిన విషయాన్ని వారు విచ్చేశారు అవిశ్రాంత తెలంగాణ పోరాటంలో ఒక్కరిని కూడా చెంప దెబ్బ కొట్టిన చరిత్ర బి ఆర్ ఎస్ దాని అనుబంధ సంఘాలకు లేదని తేల్చి చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రజాస్వామ్యంపై విశ్వాసంతోటే పోరాడి ద్రోహులను తరిమికొట్టి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న విషయం మర్చిపోరాదని పేర్కొన్నారు. నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమకారులపై తుపాకులు ఎక్కుపెట్టిన భయపడకుండా అహింసాయుత పద్ధతిలో ఎదుర్కొన్న చరిత్ర గులాబీ పార్టీదని వెల్లడించారు.
మిలిటెంట్ ఉద్యమ స్వభావాలను వివరిస్తూ పేర్కొన్న అంశాలను హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడాలని బాల్క సుమన్ బదనానం చేస్తూ సోషల్ మీడియాలో ట్రోలింగ్ మీడియాలో ప్రచారం చేయడానికి టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపు చర్యలతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని బాల్క సుమన్ కు మద్దతుగా ఎంతటి పోరాటానికైనా టీబీజీకే నిలబడుతుందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను అప్పుల కుప్పగా మార్చి దివాలా స్థితికి తీసుకు వచ్చిందని దుయ్యబట్టారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిలువలు ఉన్నట్లు తప్పుడు రికార్డు సృష్టించి భారీ మోసానికి అవినీతికి పాల్పడినట్లు వాళ్లు ఆరోపించారు.

**బొగ్గు గనులపై ప్రత్యక్ష తనిఖీలు చేస్తాం.**
సింగరేణి యాజమాన్యం వెల్లడించినట్లు బొగ్గు గనులపై చూపుతున్న బొగ్గు నిలువలను ప్రత్యక్షంగా పరిశీలిస్తామని టీబీజీకేఎస్ కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి పేర్కొన్నారు. ముగ్గు నిలువలు వాస్తవమైనప్పుడు టీబీజీకే చేపట్టే ప్రత్యక్ష తనిఖీలను అడ్డుకోవద్దని ఆయన యజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.,
ఆర్ జీవన్ వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు మోదుపల్లి రాజేశం, చెలకలపల్లి శ్రీనివాస్ బ్రాంచ్ సెక్రటరీలు దూట శేషగిరి, కోంద్ర అంజన్న, పల్లె సురేందర్, మాసాడి సాయి చరణ్, ఫిట్ సెక్రటరీలు మురళి, పులిపాక శంకర్, మీస రాజు, లక్ష్మణ్, రవీందర్, జోసఫ్ అప్సర్ పాషా, అభిషేక్, భాస్కర్, మల్లారెడ్డి, మహేష్ టీబీజీకేఎస్ నాయకులు ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

- అప్రమత్తంగా ఉండాలి
- ప్రధాని మోడీ సూచన



**న్యూఢిల్లీ, మే 27 (జనంసాక్షి):** దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్న సమయాల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించాలని, ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతరులకు తాగునీరు అందించే వారిని అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

# గోనె సంచుల్లో డబ్బుల మూటల తరలింపు

- అందుకే సంచుల కొరత
- ఆర్‌ఎస్‌పి ఆరోపణ



**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సర్కార్ పాలనలో కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచుల సరఫరా లేక ధాన్యం అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసిందే. అయితే ఆ గోనె సంచుల్లేకపోవడానికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనంటూ బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలించారు. బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన గోనె బస్తాలు ఎందుకు లేవో తెలుసా..? ఎందుకు లేవంటే ఆ గోనె బస్తాల్లో మన రక్తమాంసాలను పిండి పీల్చి పిప్పి చేసి సంపాదించిన డబ్బును మూటలల్ల పెట్టి.. ఆ మూటలను మొత్తం ప్యాక్ చేసి వాటిని ఢిల్లీకి తరలిస్తున్నడు రేవంత్ రెడ్డి. అందుకే తెలంగాణలో గోనెసంచులు దొరుకతలేవు ఇది వాస్తవం. తెలంగాణలో డబ్బు లేదు. ఎందుకంటే తెలంగాణలో డబ్బంతా అక్కడికి తరలిపోతున్నదని ఆరోపించారు.

# మహారాష్ట్రలో ఇంట్లోకి దూరిన చిరుత

### చాకచక్యంగా పట్టుకున్న అటవీ సిబ్బంది



**ముంబై, మే 27 (జనంసాక్షి) :** మహారాష్ట్రలోని అమరావతి నగరంలో జనాలతో రద్దీగా ఉండే రాంపూరి క్యాంప్ ప్రాంతంలోని ఒక ఇంట్లోకి హఠాత్తుగా ఒక చిరుత ప్రవేశించింది. ఆ నివాస ప్రాంతంలో చిరుత సంచరిస్తూ కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అటవీ శాఖ, పోలీసు సిబ్బంది, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించారు. రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగి భారీ ఆపరేషన్‌ను ప్రారంభించారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించిన అనంతరం ఎట్టకేలకు ఆ చిరుతను సురక్షితంగా బంధించారు. పట్టుబడిన ఆ చిరుతపులి వయస్సు సుమారు తొమ్మిది నుంచి పది నెలల వరకు ఉండవచ్చని రెస్క్యూ బృందం తెలిపింది. ఈ ఘటనపై అమరావతి మేయర్ శ్రీచంద్ తేజ్వానీ స్థానిక నివాసితులతో మాట్లాడారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. అధికారులు సకాలంలో స్పందించి చిరుతను బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

- సీపీ సజ్జన్నార్



**హైదరాబాద్, మే27 (జనంసాక్షి):** బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్ బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారితో బేరమాడి, రూ.5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు. అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48 వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేద ని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమ త్తంగా ఉండాలని సూచిం చారు. పశువులను అప్పగిం చే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకో వాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారు లకు సమాచారం అందించాలని సూచించారు.

# పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య

### సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం



**వాషింగ్టన్, మే27 (జనంసాక్షి):** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ పాత్రపై అగ్రరాజ్య సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం వ్యక్తం చేశారు. పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం నేపథ్యంలో పాకిస్థాన్ నిష్పాక్షిక మధ్యవర్తిగా వ్యవహరించలేదని గ్రాహం అభిప్రాయపడ్డారు. ఇరాన్‌తో శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపుపై పాకిస్థాన్ ఆసక్తి కనబరచలేదు. అబ్రహం ఒప్పందాల్లో చేరేది లేదని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో పాక్‌పై గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే దేశం మధ్యవర్తిగా వ్యవహరించడం మరింత సమస్యాత్మకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ సుదీర్ఘ కాలంగా ద్వేషంతో రగిలిపోతోంది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గతంలో పాక్ ఉన్నత స్థాయి అధికారులు చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరంగా ఉన్నాయి. అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని ట్రంప్ ఇచ్చిన పిలుపునకు పాక్ వెంటనే సమాధానం ఇవ్వాలి. పాక్ ఎయిర్‌బేస్‌లో ఇరాన్ సైనిక విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు ఇటీవల వచ్చిన వార్తలు అవాస్తవాలని కొట్టిపారెయ్యలేం' అని గ్రాహం పేర్కొన్నారు.

# రణరంగంగా గాంధీభవన్



- మంత్రుల సమక్షంలోనే నేతల బాహాబాహీ

**హైదరాబాద్, మే27 (జనంసాక్షి) :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, విహెచ్, ఎమ్మెల్సీలు బల్మూరి, అద్దంకి దయాకర్‌ల సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ సర్ ప్రక్రియపై చర్చించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు వేదికైంది. పార్టీ సీనియర్ నేత, మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చొనే విషయంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్ చార్జ్ ఉస్మాన్ ఆల్ హాజీల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మొదట ఇద్దరి మధ్య మాటల యుద్ధంతో ప్రారంభమైన ఈ గొడవ కాస్తా శృతిమించి ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఆగ్రహంతో ఉస్మాన్.. ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన ఒక్కసారిగా కిందపడిపోయారు. గాంధీభవన్ లో సీనియర్ నేతల సమక్షంలోనే ఈ రసాభాస జరగడంతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. ఈ గొడవ మరింత పెద్దది కాకుండా ఉండేందుకు అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసేసేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. వెంటనే అప్రమత్తమైన మిగతా కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలో దూరి ఇరువర్గాలను విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన తప్పేంటి?

- అరెస్ట్ చేస్తామన్న ప్రచారంపై పాశం యాదగిరి ఆగ్రహం



**హైదరాబాద్, మే 27 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగేశ్వర్ రావు చేసిన విమర్శల్లో అంత తప్పు ఏముందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను ప్రశ్నించారు. కేవలం విమర్శలు చేసినందుకే ఒక మేధావిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్య మంత్రిని చేయడమే ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యూహాలపై, గత చరిత్రపై పాశం యాదగిరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ పచ్చగా, లాభసాటిగా ఉంటే అక్కడకి వెళ్లి మేసే పశువు తరహాలో, కేవలం అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే నాయకులు కూడా ఈరోజు నీతులు చెప్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు మరణానికి కారకుడైన వ్యక్తి, ఈరోజు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూర్చోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో మీడియా అక్రిడిటేషన్ల మరియు ఛానళ్ల యాజమాన్యాలపై ఆయన సంచలన నిజాలను వెల్లడించారు. స్వరాష్ట్రమైన తెలంగాణలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ప్రస్తుతం మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ల కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో వి6 , టి న్యూస్ మినహాయిస్తే, మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి స్పష్టం చేశారు.



# నీటిగుంతలో పడి ముగ్గురు బాలలు మృతి

**పెనుకొండ, మే27 (జనంసాక్షి):** శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నీటి గుంతలో పడి ముగ్గురు బాలురు మృతిచెందారు. రొద్దం మండలం నారనాగేపల్లిలో ఈ ఘటన జరిగింది. పొలంలో నల్లనేరేడు పండ్ల కోసం వెళ్లి నీటి గుంతలో పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. బాలుర మృతితో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# మోపాల్ మండలంలో చిరుత సంచారం



**నిజామాబాద్, మే 27 (జనంసాక్షి):** జిల్లాలోని మోపాల్ మండలంలో చిరుత పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని సిరిపూర్ గ్రామంలో రాత్రి వేళ చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామ శివార్లలో ఉన్న ఒక పశువుల పాక సమీపంలోకి చిరుత రావడాన్ని గమనించిన ఓ కుక్క గట్టిగా మొరగడంతో, చిరుత అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్ళిపోయింది. అయితే, ఈ దృశ్యాలన్నీ స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టంగా రికార్డు కావడంతో సిరిపూర్ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావడానికి, పొలాలకు వెళ్లడానికి రైతులు, కూలీలు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి చిరుత దాడి చేస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఈ సీసీటీవీ ఫుటేజ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, గ్రామంలో బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని, తమకు రక్షణ కల్పించాలని సిరిపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అనంతుని ఆభరణాలు మాయం కేసులో డీజీపీ సంచలన నివేదిక

**తిరువనంతపురం, మే27 (జనంసాక్షి) :** ప్రసిద్ధ శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డీజీపీ వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్వామివారి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోంశాఖ సెక్రటరీకి డీజీపీ సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డీజీపీ నివేదిక ప్రకారం.. ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు. అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది. దీంతో ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి భద్రతను పటిష్ఠం చేయాలని హోం శాఖ సెక్రటరీని కోరారు. సందర్భంగా స్వామివారి విలువైన ఆభరణాల నిర్వహణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. అన్ని బంగారు, వెండి వస్తువులను సురక్షిత ఖజానాలకు తరలించాలని నివేదికలో పేర్కొన్నారు. సరైన తనిఖీ లేకుండా ఏ వ్యక్తినీ లోపలికి అనుమతించకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల కానుకలను ప్రత్యేక లాకర్లలో భద్రపరచాలనీ సూచించారు. మరోవైపు స్వామి వారి ఆభరణాలు అదృశ్యం కావడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

- ధాన్యం సేకరణలో ఎప్పుడూ లేనంత నిర్లక్ష్యం
- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు

వనపర్తి, మే27 (జనంసాక్షి) : రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సకాలంలో యూరియా ఇవ్వకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై భారం పడకుండా ఉంటుందని రేవంత్ కుట్ర చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. నాడు కేసీఆర్ పంట చేతికి రాగానే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. నేడు రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని దుయ్యబట్టారు.

# ఈడీ దాడులపై భగ్గుమన్న సీపీఎం

- కేరళలో పలు చోట్ల ఆందోళనలు
- బీజేపీతో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు

**తిరువనంతపురం (జనంసాక్షి) :** కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొం టామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷-దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాట్లాడుతూ, పినరయి విజయన్‌కు ఎక్సాలాజిక్ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు ఇప్పటికే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370